


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 99 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం | 19 డిసెంబర్ 2024 | పేజీలు : 12 | వెల : 2/-

## పాన్ వరల్డ్ హీరో డొనాల్డ్ జాన్ ట్రంప్



**వాషింగ్టన్** : డొనాల్డ్ జాన్ ట్రంప్.. 2024 సంవత్సరంలో పాన్ వరల్డ్ హీరో అయ్యారు. అగ్రరాజ్యం అమెరికా చరిత్రలో పుటల్లో తన పేరును లిఖించుకోగలిగారు. ఈ సంవత్సరం చిరస్మరణీయంగా మిగిలిపోతుందాయనకు. అగ్రరాజ్యం అమెరికా రాజకీయ చరిత్రలో గ్రేట్ కమ్ బ్యాక్ ఇచ్చిన ఒకే ఒక్క నాయకుడు. కోర్టు కేసులూ.. అధ్యక్ష ఎన్నికల్లో ఒకసారి ఓడిపోయి, కోర్టు కేసులనూ ఎదుర్కొంటూ, అత్యంత ప్రతికూల వాతావరణంలో కూడా రెండోసారి అమెరికా అధ్యక్ష మిగతా 2లో

## జమిలిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ

### ప్రియాంక తోపాటు 31 మంది సభ్యులు, ఏపీ నుంచి వీరే

**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్** జమిలి ఎన్నికలపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. జమిలి ఎన్నికల బిల్లుల పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీని కేంద్రం ఏర్పాటు మిగతా 2లో



### జమిలికి

## కేంద్రం డెడ్ లైన్

### ఎన్నికలపై బిగ్ స్కెచ్..!!




**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :**

కేంద్రం అనుకున్న విధంగానే ముందుకు వెళ్తోంది. జమిలి పైన వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. జమిలి బిల్లును అభ్యంతరాల నడుమ పార్లమెంట్ లో ప్రవేశ పెట్టింది. ప్రతిపక్షాలు జేపీసీ కోసం డిమాండ్ చేస్తున్న వేళ.. ప్రభుత్వమే జేపీసీ ప్రకటన మిగతా 2లో

### టీడీపీ భవిష్యత్‌కు

# కీలక మలుపు



ఒక్క పాదయాత్ర రాష్ట్ర రాజకీయ చరిత్రనే మార్చేసింది. అవమానాలు ఎదుర్కొన్న యువనేతను నాయకుడిని చేసింది. వేధించిన పాలకులకు చమర గీతం పాడింది. సంక్షోభమే అవకాశం గా మారింది. అదే అనూహ్య ప్రజా విజయాన్ని అందించింది. కూటమి ప్రభుత్వానికి నాందిగా నిలిచింది. యువగళ మే ప్రజాగళమై ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు కారణమైంది. ఆ యువగళం రాటు తేల్చిన నేతే నారా లోకేష్. మంత్రిగా అటు పార్టీ .. ఇటు ప్రభుత్వంలో కీలకంగా మారారు. యువగళం నేటితో ఏడాది పూర్తి చేసుకుంటున్న వేళ.. లోకేష్ ను పోరాట యోధుడిగా పార్టీ గుర్తు చేసుకుంటోంది. యాత్రతోనే మొదలు నారా లోకేష్. యవగళం ముందు..ఆ తరువాత అని చెప్పుకొనే స్థాయిలో ఎదిగిన నేత. తండ్రి స్ఫూర్తితో పార్టీ కోసం.. నాటి ప్రభుత్వంలో బాధలు పడుతున్న వారికి అండగా నిలిచేందుకు గత ఏడాది జనవరి 27న కుప్పం నుంచి నారా లోకేష్ యువగళం యాత్ర మొదలైంది.


**విజయవాడ, విశ్వంవాయిస్ న్యూస్ :**

లోకేష్ ఎక్కువ రోజులు నడవలేరని అవహేళన చేసిన వారికి తన యాత్రతోనే సమాధానం చెప్పారు. ప్రజలతో మమేకం అవుతూ వారికి దగ్గరయ్యారు. యాత్ర సాగే కొద్దీ స్పందన పెరిగింది. ప్రజా సమస్యల పైన అవగాహన వచ్చింది. ప్రజలు ఏం కోరుకుంటున్నారో అర్దమైంది. ప్రభుత్వం పైన ఎంత వ్యతిరేకత ఉందో గుర్తించారు. తమ పార్టీలో సమస్యలను తెలుసుకున్నారు. అదే ఎన్నికల్లో మేనిఫెస్టోతో పాటుగా అభ్యర్దుల ఖరారులో కీలకంగా మారింది. అవరోధాలు అధిగమించి కుప్పంలో ప్రారంభమైన యాత్ర 11 ఉమ్మడి జిల్లాలు, 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, మున్సిపాలిటీలు, 2 వేల 28 గ్రామాల మీదుగా 226 రోజులు కొనసాగింది. లోకేష్ యాత్రను అడ్డుకునేందుకు నాటి ప్రభుత్వం అవరోధాలు సృష్టించింది. అక్రమ కేసులు పెట్టి వేధించింది. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రతీ రోజూ వెయ్యి నుంచి పదిహేను వందల మంది పార్టీ నాయకుల తో పాటుగా కార్యకర్తలను కలిసేవారు. వారి నుంచి సేకరించిన సమాచారం.. క్షేత్ర స్థాయి వాస్తవాలు.. నాటి ప్రభుత్వం అణచివేత లోకేష్ ను రాజకీయంగా రాటు తేల్చాయి. అన్ని వర్గాలతో లోకేష్ మమేకం అయ్యారు. సమస్యలతో వచ్చిన వారికి భరోసా నింపారు. అయితే సెప్టెంబరు 9న చంద్రబాబు అరెస్టుతో పాదయాత్రకు సుదీర్ఘ విరామం ఏర్పడింది. రాటు తేల్చిన యాత్ర ఆ మిగతా 2లో

### నూజివీడు మామిడి

## భారీ ఇమేజ్

### చంద్రబాబు సర్కార్ సంచలన నిర్ణయం!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తుంది. గతంలో లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో నూజివీడు ప్రాంతంలోని మామిడి రైతుల సమస్యలు విని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 30 కోట్లతో నూజివీడు మార్కెట్ యార్డ్ అభివృద్ధి ఈ క్రమంలో మామిడి రైతుల సౌకర్యార్థం నూజివీడు మార్కెట్ యార్డ్ లో వివిధ మౌలిక సదుపాయ మిగతా 2లో

### ముంబైలో ఘోర

## పడవ ప్రమాదం

### 13 మంది మృతి, పలువురు గల్లంతు



**ముంబై :** ముంబై సముద్ర తీరంలో బుధవారం ఘోర పడవ ప్రమాదం చోటు చేసుకుంది. గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా ద్వీపానికి ప్రయాణికులతో వెళ్తోన్న ఫెర్రీ మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందారని, 101 మందిని కాపాడినట్లు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. కాగా, ఈ ఘటన ఫెర్రీని స్పీడ్ బోటు ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరికొందరి ఆచూకీ లభ్యం కాలేదని, వారికోసం గాలింపు కొనసాగుతోందని దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. దీంతో మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి ఎలిఫెంటా గుహలకు 'నీల్‌కమల్' అనే ఫెర్రీ.. 110 మందికిపైగా పర్యటకులతో బయల్దేరింది. అయితే, చక్కర్లు కొడుతూ వేగంగా వచ్చిన ఓ చిన్న బోటు దాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఫెర్రీ మునిగిపోయింది. దీంతో తమను కాపాడాలంటూ ప్రయాణికులు ఆర్తనాదాలు చేశారు. వెంటనే స్పందించిన రెస్క్యూ బృందాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. 11 నేవీ పడవలతో సహా తీర ప్రాంత దళాలకు చెందిన మూడు పడవలు, నాలుగు హెలికాప్టర్లు కూడా ఈ ఆపరేషన్‌లో మిగతా 2లో

### మంత్రిగా నాగబాబు ఎంట్రీకి

## "మెగా" బ్రేక్



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** : మెగా బ్రదర్ ఏపీ మంత్రిగా ఛాన్స్ దక్కింది. ప్రకటన వచ్చి రోజులు గడుస్తున్నాయి. కానీ, నాగబాబు మంత్రి అయ్యేదెప్పుడు అనేది మాత్రం ఇంకా స్పష్టత రావటం లేదు. రాజ్యసభ సీటు దక్కని నాగ బాబుకు మంత్రిగా అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. మంత్రిని చేసి ఎమ్మెల్సీగా తీసుకోవాలని డిసైడ్ అయ్యారు. అయితే, ఇప్పుడు కొత్త అంశాలు తెర మీదకు వస్తున్నాయి. నాగబాబు మంత్రిగా ప్రమాణ స్వీకారం కు సిద్దం అవుతున్న "మెగా" బ్రేక్ ఆసక్తి కరంగా మారింది.

**నాగబాబు మంత్రిగా ఎప్పుడు :** రాజ్యసభ రేసులో చివరి వరకు నాగబాబు పేరు వినిపించింది. కానీ మిగతా 2



## రిలీజ్ ది షిప్

### పవన్‌కు కేంద్రం బిగ్ షాక్..!!

**పిఠాపురం, విశ్వంవాయిస్ న్యూస్** : సీజ్ ది షిప్. దేశ వ్యాప్తంగా ట్రెండింగ్ అయింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టు లో ఇచ్చిన ఆదేశం. షిప్ సీజ్ చేయండి.. కేంద్రం తో నేను మాట్లాడుతాను అంటూ.. పవన్ నాడు పోర్టు లో చెప్పుకొచ్చారు. ఈ షిప్ లో బియ్యం ఎగుమతుల పైన అధికారిక లెక్కలు .. రాజకీయ విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ ఏపీకి కీలక సూచన చేసింది. షిప్ నిలిపివేత సరి కాదని తేల్చింది. పరోక్షంగా పవన్ కు కేంద్రం బిగ్ షాక్ ఇచ్చింది.ఎన్సీఈఎల్ మిగతా 2లో

## వాడీవేడిగా తెలంగాణ అసెంబ్లీ

### మూడు కీలక బిల్లులకు ఆమోదం

**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్** : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం వాడీవేడిగా సాగాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల తూటాలు పేలాయి. అయినప్పటికీ ఈ సమావేశంలోనే శాసనసభ మూడు ప్రభుత్వ బిల్లులకు ఆమోద ముద్ర వేసింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, విశ్వవిద్యాలయాల చట్టసవరణ, జీఎస్టీ చట్ట సవరణ బిల్లులకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం మిగతా 2లో



# ఎడిటర్ వాయిస్

## 'జమిలి' నిరంకుశం!

అన్నివైపుల నుండి వ్యతిరేకత వస్తున్నా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' లక్ష్యంగా రూపొందించిన వివాదాస్పద జమిలి (రాజ్యాంగ సవరణ) బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని, ప్రజాస్వామ్య స్వరూపంపైన, సమాఖ్యవాదంపైన దాడిగా దీనిని అభివర్ణించడం సరైనదే! రాష్ట్ర అసెంబ్లీ పదవీ కాలాన్ని కేంద్ర పదవీ కాలంలోకి మార్చడం రాజ్యాంగానికి ద్రోహం చేయడమేనని విమర్శించాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, అలాగే లోక్‌సభ ఎన్నికలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ విషయమై ఓటింగ్ కోరగా 269 మంది సభ్యులు రాజ్యాంగ సవరణ బిల్లును సమర్పించడానికి మద్దతు ఇవ్వగా 198 మంది సభ్యులు వ్యతిరేకించారు. బిల్లు అంతిమంగా నెగ్గడానికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. కానీ ఆ పరిస్థితి లేకపోయినా మోడీ ప్రభుత్వం బిల్లును బుల్డోజ్ చేయడం నిరంకుశ పోకడలకు నిదర్శనం. ఏమైనప్పటికీ ప్రజెంటేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపక తప్పలేదు. సమగ్ర అధ్యయనం, విస్తృత చర్చల తర్వాతే బిల్లు తీసుకొచ్చామని, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని మంత్రి మేఘ్వాల్ లోక్‌సభకు సుతిమెత్తగా వివరించారు. కానీ, 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే భావన రాజ్యాంగంలోని ఫెడరలిజంతో సహా దాని మౌలిక స్వరూపానికి విరుద్ధం. 'బిల్లులోని నిబంధనలు శాసన వ్యవస్థ అధికార పరిధిని ఉల్లంఘించేవిగా ఉన్నాయి. లోక్‌సభ పదవీకాలం ప్రకారం శాసన సభల పదవీకాలం నిర్ణయించబడదు. చట్టసభలు విడివిడిగా ఉంటాయి. ఈ బిల్లుతో అధిక కేంద్రీకరణ అమలులోకి వస్తుంది. సభల కాలవ్యవధి, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అధికారాలను ఎన్నికల కమిషన్‌కే వదిలేస్తున్నారు. అలా అయితే ఒక వ్యక్తి కోరిక నెరవేర్చడం కోసమే ఈ బిల్లులను పెట్టినట్లు ఉంటుంది' అన్న ప్రతిపక్ష ఎంపీల విమర్శ అక్షర సత్యం. ఈ బిల్లుతో దేశ గణతంత్ర రాజ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ%% రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవని, కానీ ఈ బిల్లుతో ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ పెత్తనం కిందికి వెళ్లిపోతాయన్న సిపిఎం ఎంపి అమ్రా రామ్ ఆందోళన ఈ దేశంలోని ప్రజాస్వామ్య ప్రియులందరిదీను. దేశంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో రకమైన భాష, తమదైన అధికార వికేంద్రీకరణ కలిగి ఉన్నాయి. వాటిపై రాష్ట్రాలకు గల హక్కును కేంద్రం ఎలా లాక్కొంటుంది? కానీ ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రాంతీయ పార్టీలు మూడూ ఈ బిల్లును సమర్థించడం ఆత్మహత్యా సదృశం. జమిలి ఎన్నికల వల్ల ఎన్నికల వ్యయం తగ్గుతుందన్న మాట సర్వాబద్ధం. మోడీ సర్కారుకు ఊపిరి పోస్తూ ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న జెడియు నుంచి ఎవరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి



పక్కన పెట్టినా పంచాయతీలు, స్థానిక సంస్థల ప్రాథమిక సూత్రమైన వికేంద్రీకరణ స్ఫూర్తికే పూర్తి విరుద్ధమైనది. కీలకమైన 'స్థానికత' మాయమవుతుంది కదా! గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అవగాహనకే ఇది విఘాతం. గత 75 ఏళ్లలో ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయో, పార్లమెంట్, శాసనసభలు ఎలా ఏర్పడ్డాయో మనం చూశాం.

ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

## పాన్ వరల్డ్ హీరో డొనాల్డ్ జాన్ ట్రంప్

పీఠాన్ని అధిరోహించగలగడం అసాధారణ విషయం. పైగా- రికార్డు స్థాయి మెజారిటీతో గెలవడం అంటే మాటలు కాదు. అమెరికా 47వ అధ్యక్షుడిగా జనవరి 20వ తేదీన అధ్యక్షుడిగా ప్రమాణం చేయనున్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ ప్రమాణం చేస్తారు. సునామీ.. ఈ ఏడాది నవంబర్ 5వ తేదీన జరిగిన ఎన్నికల్లో 312 ఎలక్టోరల్ ఓట్లతో సునామీ సృష్టించారు డొనాల్డ్ ట్రంప్. 49.9 శాతం ఓట్లతో అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఆయనకు పోల్ అయిన మొత్తం ఓట్ల సంఖ్య ఏడు కోట్లను దాటింది. 7,72,68,289గా లెక్క తేలింది. ఈ ఎన్నికలను ట్రంప్ ఏకపక్షంగా మార్చివేశారు తన ఛరిష్మాతో. పోటీ ఇవ్వలేని కమల హ్యారిస్.. డొనాల్డ్ ట్రంప్ ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌కు పడ్డ ఓట్ల శాతం 48.4. మొత్తంగా 7,49,82,822 ఓట్లకే ఆమె పరిమితం కావాల్సి వచ్చింది. 2019 నాటి ఎన్నికల్లో డెమోక్రాట్లకు పట్టం కట్టిన కొన్ని కీలక రాష్ట్రాలు ఈ దఫా స్వింగ్ అయ్యాయి. రిపబ్లికన్ల వైపు మొగ్గు చూపాయి. పని పోయిందనుకున్న వాళ్లే..2019 నాటి ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తరువాత డొనాల్డ్ ట్రంప్ పని అయిపోయిందనే అనుకున్నారంతా. సొంత రిపబ్లికన్ పార్టీలోనే ఆయనకు పోటీ ఎదురైంది. అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిత్వం కోసం రిపబ్లికన్ పార్టీ నుంచి నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి వంటి నాయకులు పోటీ పడ్డారు. ఆ తరువాత వాళ్లందరూ తప్పుకోవడంతో ట్రంప్ రేసులో నిలిచారు. బలమైన జోడీతో ఢీ.. ప్రస్తుతం అధికారంలో ఉన్న అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ జోడీని విజయవంతంగా ఎదుర్కొనగలిగారు. ఈ క్రమంలో తుపాకీ గుళ్లను కూడా రుచి చూడాల్సొచ్చింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీలో ప్రసంగిస్తోన్న సమయంలో ఆయనపై కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఆయన కుడిచెవిని రాసుకుంటూ వెళ్లింది బుల్లెట్. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడగలిగారాయన. రెండుసార్లు ఫైరింగ్.. ఆ తరువాత కూడా ఆయనపై కాల్పులు జరిగాయి. ఫ్లోరిడా వెస్ట్ పామ్ బీచ్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ క్లబ్‌లో గోల్ఫ్ ఆడుతున్న సమయంలో ఆయనను లక్ష్యంగా చేసుకుని షూటర్ కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి అపాయం సంభవించలేదు. రాజకీయంగా, భౌతికంగా ఇన్ని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని అగ్రరాజ్యాధినేతగా ఎదిగారు డొనాల్డ్ ట్రంప్. టైమ్ అవార్డ్.. ఈ స్థాయిలో ఘన విజయాన్ని సాధించిన డొనాల్డ్ ట్రంప్‌ను పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2024గా ఎంపిక చేసింది ప్రతిష్ఠాత్మక టైమ్ మేగజైన్. ఈ అరుదైన గుర్తింపును పొందడం ఆయనకు ఇది రెండోసారి. 2016లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినందుకు అప్పుడు కూడా పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యారు.

## జమిలిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ

చేసింది. పీపీ చౌదరి ఛైర్మన్‌గా ఏర్పాటైన ఈ కమిటీలో బీజేపీ తరపున అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ తరపున ప్రియాంక గాంధీ తదితరులకు చోటు కల్పించింది. వివిధ పార్టీలకు చెందిన మొత్తం 31మంది సభ్యులతో కూడిన జేపీసీలో లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులు రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులను స్పీకర్ ఓం బిర్లా నియమించారు. లోక్‌సభ నుంచి చోటు దక్కించుకున్న 21 మంది సభ్యుల్లో పీపీ చౌదరి, సీఎం రమేశ్, బాన్సురీ స్వరాజ్, పురుషోత్తమ్ రూపాలా, అనురాగ్ ఠాకూర్, విష్ణు దయాళ్ రామ్, భర్తృహరి మహ్తాబ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూనీ, విష్ణుదత్ శర్మ, ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖదేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కళ్యాన్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, జీఎం హరీశ్ బాలయోగి, సుప్రియా సూలే, శ్రీకాంత్ షిండే, చందన్ చౌహాన్, వల్లభనేని బాలశౌరి ఉన్నారు. కాగా, ఈ కమిటీలో ఏపీ నుంచి ముగ్గురు సీఎం రమేశ్, బాలశౌరి వల్లభనేని, జీఎం హరీశ్ బాలయోగి సభ్యులుగా ఉండటం గమనార్హం. వీరితోపాటు రాజ్యసభ నుంచి 10 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల చివరి వారంలో ఈ కమిటీ నివేదిక సమర్పించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా, దేశంలో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఓటింగ్ ప్రక్రియ ద్వారా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చారు. దీంతో 90 నిమిషాల చర్చ తర్వాత ఓటింగ్ జరగ్గా బిల్లు ప్రవేశపెట్టేందుకు అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. ఈ క్రమంలో బిల్లును ప్రవేశపెట్టడానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోద ముద్ర వేశారు. అయితే, ఈ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా కేంద్రం నియంతృత్వంగా వ్యవహరించిందని ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. వాటిని కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేసింది. ఈ నేపథ్యంలో విపక్షాల డిమాండ్ నేపథ్యంలో బిల్లును జేపీసీకి పంపడానికి తమకేమీ అభ్యంతరం లేదని పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ బిల్లును పరిశీలించేందుకు తాజాగా 31 మంది సభ్యులతో కేంద్రం జేపీసీని ఏర్పాటు చేసింది.

## పడవ ప్రమాదం

ఉన్నట్లు తెలుస్తోంది. 'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి ఎలిఫెంటా గుహలకు 'నీల్‌కమల్' అనే ఫెర్రీ.. 110 మందికిపైగా పర్యటకులతో బయల్దేరింది. అయితే, చక్కర్లు కొడుతూ వేగంగా వచ్చిన ఓ చిన్న బోటు దాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఫెర్రీ మునిగిపోయింది. దీంతో తమను కాపాడాలంటూ ప్రయాణికులు ఆర్తనాదాలు చేశారు. వెంటనే స్పందించిన రెస్క్యూ బృందాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. 11 నేవీ పడవలతో సహా తీర ప్రాంత దళాలకు చెందిన మూడు పడవలు, నాలుగు హెలికాప్టర్లు కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. 101 మందిని రెస్క్యూ బృందాలు కాపాడాయి. అయితే, అప్పటికే లైఫ్ జాకెట్లు కాపాడలేకపోవడంతో 13 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గల్లంతయ్యారు. కాగా, ప్రమాద ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'ఎలిఫెంటా ద్వీపానికి వెళ్లే మార్గంలో నీల్కమల్ పడవ ప్రమాదానికి గురైందని మాకు సమాచారం అందింది. నేవీ, కోస్ట్ గార్డ్, పోర్ట్, పోలీసు బృందాల నుంచి రెస్క్యూ బోట్‌లను వెంటనే పంపించారు. మేము జిల్లా, పోలీసులతో నిరంతరం టచ్‌లో ఉన్నాం. చాలా మంది ప్రయాణీకులను కాపాడటం జరిగింది. అయితే రెస్క్యూ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రెస్క్యూ ప్రయత్నాల కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఉపయోగించమని జిల్లా అధికారులకు సూచించాం' అని సీఎం ఫడ్నవీస్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## కేంద్రం డెడ్ లైన్

చేసింది. ఇప్పుడు 31 మందితో ఉభయ సభల సభ్యులతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు కానుంది. నివేదిక కోసం డెడ్ లైన్ ఖరారు చేసిన కేంద్రం .. ఎన్నికల నిర్వహణ పైన నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. **31 మందితో కమిటీ :** జమిలి ఎన్నికల బిల్లు కోసం కేంద్రం 90 రోజుల గడువు నిర్ణయించింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీకి బిల్లును సిఫార్సు చేస్తూనే.. సమయం నిర్దేశించింది. ఇందు కోసం ఉభయ సభల్లోని సభ్య లకు అవకాశం ఇవ్వనుంది. పార్టీల నుంచి వచ్చిన పేర్లను కమిటీలో నియామకం చేయనున్నారు. స్పీకర్ అధికారికంగా నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి 90 రోజుల్లో కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ తో పాటు మనీష్ తివారీ, సుఖ్‌దేవ్ భగత్, రణదీప్ సూర్జేవాలా పేర్లను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసినట్లు సమాచారం.

**పార్టీల ప్రతినిధులుగా :** బీజేపీ నుంచి ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, నిశికాంత్ దుబే పేర్లను ప్యానెల్ సభ్యులుగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. టీఎంసీ నుంచి ఇద్దరి పేర్లను సిఫార్సు చేసారు. కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ సభ్యుడు సాకేత్ గోఖలే పేర్లు దాదాపు ఖరారయ్యాయి. శివసేన నుంచి మహారాష్ట్ర మాజీ సీఎం షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే, జేడీయూ నుంచి సంజయ్ ఝా తో పాటుగా డీఎంకే నుంచి సెల్వ గణపతి, పీ వీల్స్ పేర్లు జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం 31 మంది ఉండే ఈ కమిటీ లో లోక్ సభ నుంచి 21, రాజ్యసభ నుంచి పది మంది ఉండనున్నారు.

**90 రోజుల సమయం :** జేపీసీకి సంబంధించి సభలో నిర్ణయం జరగటంతో ఈ కమిటీ ఏర్పాటు పైన స్పీకర్ ప్రకటన చేయనున్నారు. జమిలి బిల్లు పరిగణలోకి తీసుకునే అంశం పైన ఓటింగ్ జరిగింది. 360 మంది ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో కొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేసారు. కాగా, మరికొందరు బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేశారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది ఓటింగ్ చేసారు. ఇక, ఇప్పుడు జేపీసీ తమ నివేదిక ఇచ్చిన తరువాత సభలో చర్చించి.. బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ప్రయత్నించనుంది. ఇక, ఎన్నికల నిర్వహణ పైన సభలోనే ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

## పవన్‌కు కేంద్రం బిగ్ షాక్..!!

లేఖతో కొద్ది రోజుల క్రితం కాకినాడ నుంచి ప్రజా పంపిణీకి వినియోగించే బియ్యం రవాణా పై డిప్యూటీ సీఎం పవన్ సీరియస్ అయ్యారు. నేరుగా సముద్రంలోకి వెళ్లి షిప్ లో రవాణా చేస్తున్న బియ్యం పై ఆరా తీసారు. ఆ రోజునే సీజ్ ది షిప్ అంటూ ఆదేశించారు. షిప్ ను చూడకుండా తనను అడ్డుకుం టున్నారని చెప్పుకొచ్చారు. తనను కాకినాడ పోర్టుకు రాకుండా ఒత్తిడి వచ్చిందని పేర్కొన్నారు. ఇక, పవన్ చేసిన సీజ్ ది షిప్ కామెంట్స్.. బియ్యం రవాణా అంశం రాజకీయంగా సంచలనంగా మారింది. ఈ వ్యవహారం పైన తాజాగా కాకినాడ జిల్లా కలెక్టర్ ప్రకటన చేసారు. ఏ మేర బియ్యం ఎగుమతుల పేరుతో తరలిస్తుందీ వివరించారు.

**డీల్ పై ప్రభావం :** పవన్ పర్యటన..వివాదం తరువాత ప్రభుత్వం బియ్యం ఎగుమతుల పైన నియమించిన సిట్ విచారణ మొదలు పెట్టింది. ఇక, ఇదే సమయంలో షిప్ సీజ్ చేసే అధికారం పైన భిన్నాభిప్రాయా లు వ్యక్తం అయ్యాయి. దీని పైన తాజాగా కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ స్పందించింది. ఏపీ ప్రభుత్వానికి.. కాకినాడ కలెక్టర్ కు లేఖ రాసింది. అందులో ఆఫ్రికా తో ఒప్పందాలకు ఇబ్బంది తీసుకురావద్దని సూచించింది. తనిఖీల పేరిట ఆటంకాలతో దేశానికి ఇబ్బంది వస్తుందని పేర్కొంది. ఆకలి నివారణ కోసం ఆఫ్రికాతో జీటుజీ డీల్ చేసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. కాకినాడ పోర్టు నుంచి నూక బియ్యం ఎగుమతులు జరుగుతాయని వాటి నిలిపివేతతో ఒప్పందానికి దెబ్బగా వివరించింది.

**భారత్ – ఆఫ్రికా ఒప్పందం మేరకే :** దీనికి కొనసాగింపుగా కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు ఎగుమతయ్యే నూకల విషయంలో అధికారులు తనిఖీల పేరుతో ఇక్కట్లు కలిగించవద్దని ఎన్సీఈఎల్ కోరింది. జీటుజీ ఒప్పందంలో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు ఎన్‌సీఈఎల్ నూక బియ్యాన్ని ఎగు మతి చేస్తోందని ఆ సంస్థ సీఈవో అనుపమ్‌కౌశిక్ వివరించారు. ఇందులో ఫోర్టిఫైడ్ రైస్ ఆనవాళ్లు ఉన్నాయనే కారణంతో కొంతకాలంగా బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఎగుమతి చేయ కుండా కాకినాడ అధికారులు అడ్డుకోవడం సరికాదని లేఖలో ఎన్‌సీఈఎల్ తన లేఖలో పేర్కొంది. ఇదే విషయమై భారత విదేశీ వ్యవహారాలశాఖ తరచూ ఎన్‌సీఈఎల్‌కు మెయిల్స్, ఫోన్లు చేస్తూ ఎగుమతులు ఆగడంపై ప్రశ్నిస్తోందని ఆ లేఖలో ప్రస్తావించింది. కేంద్ర హోంశాఖ తోపాటు సహకార శాఖ పరిధిలో ఎన్‌సీఈఎల్ పనిచేస్తుంది.

## "మెగా" బ్రేక్

సానా సతీశ్ కు రాజ్యసభ ఖాయం కావటంతో నాగబాబుకు మంత్రిగా అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. నాగబాబు ఏ సభలోనూ సభ్యుడు కాదు. దీంతో, మంత్రిగా చేసి ఆరు నెలల్లో మంత్రిని చేయాలని తొలుత భావించారు. దీంతో, నాగబాబుకు ఇచ్చే శాఖ పైన సీఎం చంద్రబాబు ... డిప్యూటీ సీఎం పవన్ తో చర్చించారు. నాగబాబుకు ప్రస్తుతం కందుల దుర్గేశ్ వద్ద ఉన్న టూరిజం, సినిమాటోగ్రఫీ నాగబాబుకు బదలాయించాలని దాదాపు నిర్ణయానికి వచ్చినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

**శాఖల పైనా చర్చ :** ఇక, కందుల దుర్గేశ్ కు ప్రస్తుతం పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న అటవీ పర్యావరణ శాఖ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే.. అసలు నాగబాబు మంత్రిగా ప్రమాణ స్వీకారం ఎప్పుడు అనే దాని పైన కూటమిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నాగబాబును మంత్రిగా ప్రకటన చేసిన తరువాత కుటుంబ పాలన అంశం పైన సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అదే విధంగా జనసేన లో బీసీ వర్గాలకు అవకాశం దక్కకుండా నాగబాబు ను మంత్రిగా తీసుకోవటం పైన అంతర్గతంగా చర్చ సాగుతోంది. టీడీపీ నుంచి పలువురు మంత్రి పదవి ఆశించి భంగ పడ్డారు. ఇప్పుడు, మెగా కుటుంబం నుంచే ఒకే కేబినెట్ లో ఇద్దరు మంత్రులు ఏంటనే చర్చ తెర మీదకు వచ్చింది.

**ఎమ్మెల్సీ అయినాకనే :** ఇదే సమయంలో ముందుగా మంత్రిని చేసి.. ఆ తరువాత ఎమ్మెల్సీ చేయాలనే అభిప్రాయం తో పవన్ విభేదించినట్లు తెలుస్తోంది. నాగబాబు ఎమ్మెల్సీ అయిన తరువాతనే మంత్రిగా తీసుకోవాలి అని సూచన చేసారని చెబుతున్నారు. అయితే, వైసీపీకి చెందిన ఎమ్మెల్సీలు చేసిన రాజీనామాలు ప్రస్తుతం మండలి ఛైర్మన్ వద్ద పెండింగ్ లో ఉన్నాయి. అవి ఆమోదం పొంది..ఎన్నికల సంఘం ఉప ఎన్నికలకు నిర్ణయిస్తే అందులో ఒకటి నాగబాబుకు కేటాయించే ఛాన్స్ ఉంది. ఇక, మార్చి లో మరో నలుగురు ఎమ్మెల్సీలు పదవీ విరమణ చేయనున్నారు. ఆ సమయంలో అయినా నాగబాబు కు ఎమ్మెల్సీగా ఛాన్స్ దక్కనుంది. దీంతో, ఎమ్మెల్సీ అయిన తరువాతనే నాగబాబు మంత్రి అవుతారనే వాదనతో మంత్రిగా మెగాబ్రదర్ ప్రమాణ స్వీకారం పై ఉత్కంఠ కొనసాగుతోంది.

## వాడీవేడిగా తెలంగాణ అసెంబ్లీ

తెలిపింది. స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లును ముఖ్యమంత్రి తరపున దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖ శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఉద్దేశాలు, లక్ష్యాలను మంత్రి తెలియజేశారు. ఈ దశలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. పరిశ్రమల కోసం భూసేకరణ, రైతుల అక్రమ అరెస్టులపై తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని చర్చకు చేపట్టాలని బీఆర్ఎస్ పట్టుబట్టింది. ప్లకార్డులతో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. మరోవైపు, ఇదే సమయంలో ఆరు గ్యారెంటీలు అమలు చేయనందుకు తాము ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసు విషయమై బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. ఇరు పార్టీల సభ్యులు సభలో నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసనల మధ్యే కాంగ్రెస్ సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ క్రీడా విశ్వవిద్యాలయం బిల్లుపై చర్చలో పాల్గొన్నారు. విపక్ష సభ్యుల ఆందోళనపై ఘాటుగా స్పందించారు అసెంబ్లీ వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని, పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసును సభాపతి నిబంధనల మేరకు చేపడతారన్నారు. అయినప్పటికీ.. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల ఆందోళన కొనసాగుతుండటంతో.. ఆ సమయంలోనే బిల్లులను ఆమోదానికి ప్రవేశపెట్టారు. మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టిన క్రీడా విశ్వవిద్యాలయ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.

**చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం :** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి తెలంగాణ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లును సీఎం తరఫున మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టారు. జీఎస్టీ చట్ట సవరణ బిల్లును మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసనలు జరుగుతుండటంతో రెండు బిల్లులపై ఎలాంటి చర్చ లేకుండానే అసెంబ్లీ ఆమోదం తెలిపింది. పర్యాటక విధానంపై స్వల్ప చర్చ అనంతరం సభను గురువారం నాటికి స్పీకర్ వాయిదా వేశారు. గురువారం మరో నాలుగు కీలక బిల్లులు శాసనసభ ముందుకు రానున్నాయి.

## భారీ ఇమేజ్

కల్పనకు 30 కోట్ల రూపాయలను మంజూరు చేసామని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. నూజివీడు మామిడికి మరింత ఇమేజ్ చేకూర్చి రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు నూజివీడు మార్కెట్ యార్డును 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. నూజివీడు మామిడికి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు నేడు నూజివీడు మార్కెట్ యార్డ్ లో సౌకర్యాల ఏర్పాటు పైన రైతులు, వ్యాపారస్తులు, అధికారులతో సమీక్షించిన మంత్రి నూజివీడు మామిడికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ఇటీవల కాలంలో నాణ్యమైన మామిడి దిగుబడి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఎంతగానో నష్టపోతున్నారని, అయితే రైతులకు భరోసా కల్పించడం కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందని అన్నారు. నూజివీడు మామిడి విదేశాలకు ఎగుమతి చేసేలా ఎయిర్ కార్గో సేవలు రైతాంగ సంక్షేమానికి సబ్సిడీతో కూడిన పథకాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. నూజివీడు మామిడి ఇమేజ్ ను మరింత పెంచడం కోసం నాణ్యమైన మామిడి పంట కోసం రైతులు కృషి చేయాలన్నారు. నూజివీడు మామిడి కి పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూజివీడు నాణ్యమైన మామిడిని విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన ఎయిర్ కార్గో సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు. నూజివీడు మామిడికి బంగారు భవిష్యత్ అందిస్తాం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను, ఫుడ్ పార్క్ ను నూజివీడు ప్రాంతంలో ఏర్పాటు చేసి నూజివీడుకు బంగారు భవిష్యత్తును అందిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. వ్యవసాయం మరియు అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యతని ఇస్తున్నారు అని తెలిపారు . గత ప్రభుత్వం విస్మరించిన మామిడి పంటకు బీమా పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని కూడా ఆయన పేర్కొన్నారు. నూజివీడు మామిడి రైతులకుఅండగా ప్రభుత్వం మామిడి పరిశోధనా సంస్థ శాస్త్రజ్ఞులు రైతులకు ఉపయోగపడేలా మరిన్ని సూచనలు చేయాల్సిన అవసరం ఉందని, క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన మామిడి ఉత్పత్తి కోసం తీసుకోవలసిన చర్యలను సూచించాలని పేర్కొన్నారు. నూజివీడు మామిడి రైతులకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తుందని, వారికి కావలసిన సకల సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## కీలక మలుపు

సమయంలో లోకేష్ పైన పెద్ద బాధ్యత ఏర్పడింది. చంద్రబాబు అరెస్ట్‌తో పార్టీలో అలజడి లేకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తండ్రి కేసులో ఢిల్లీ కేంద్రంగా న్యాయ నిపుణులతో చర్చలు చేసారు. ఆ సమయంలోనే పొత్తుల అంశం పైన ఢిల్లీలో కసరత్తు మొదలైంది. ఆ వేళ తన పరిణితి ప్రదర్శించారు. యువగళం యాత్ర వేళ లోకేష్ పైన మొత్తంగా 25 వరకు కేసులు నమోదు అయ్యాయి. 40 మంది యువగళం వాలంటీర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకి పంపారు. గన్నవరం నియోజకవర్గంలో విదేశాలతో ఉన్నవారు సహా 46 మందిపై తప్పుడు కేసులు పెట్టారు. ఇవన్నీ లోకేష్ లో మరింత కసిని పెంచాయి. దీని ఫలితమే రెడ్ బుక్. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారుల పైన చర్యలు తప్పవనే నాటి హెచ్చరికలు నేడు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్నారు. అధికారం లో కీలకంగా అనేక వర్గాలతో యువగళం లో సమావేశాలు నిర్వహించారు. మొత్తంగా 70 బహిరంగ సభలు, 155 ముఖాముఖి సమావేశాలు, 12 ప్రత్యేక కార్యక్రమాలు, 8 రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజల నుంచి వినతి పత్రాలు అందుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన వస్తున్నా మీకోసం పాదయాత్రను అగనంపూడి వద్దే సరిగ్గా ఏడాది క్రితం యువగళం యాత్ర ముగించారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని పోలిపల్లి వద్ద తెలుగుదేశం విజయోత్సవ సభను నిర్వహించారు. ఆ యువగళం యాత్ర స్ఫూర్తితోనే ఎన్నికల్లో పార్టీ శ్రేణుల్లో గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పని చేసేలా కదిలించింది. కూటమి ఎన్నికల్లో 164 సీట్లతో అధికారంలోకి రావటానికి చంద్రబాబు అరెస్ట్.. లోకేష్ యువగళం టీడీపీ కేడర్ కు టానిక్ లా పని చేసాయి. పార్టీ – ప్రభుత్వానికి వారధి..సారథి లోకేష్ పార్టీలో ఎంట్రీ సమయం నుంచి కార్యకర్తల పైనే ఎక్కువగా ఫోకస్ చేసారు. దేశంలో మరే ఇతర పార్టీకి లేని సైన్యం టీడీపీకి ఉంది. కార్యకర్తలకు భీమా సౌకర్యం తీసుకొచ్చారు. పార్టీ – ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచారు. అదే విధంగా అధికారంలోకి వచ్చిన తరువాత కీలక మైన విద్యాశాఖ పర్యవేక్షిస్తున్నారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇక, ప్రజా దర్బార్ ద్వారా ఇబ్బందుల్లో ప్రతీ ఒక్కరికీ బాసటగా నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో కష్టంలో ఉన్నామంటూ పోస్టింగ్ పెడితే వెంటనే స్పందిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. పాలనలో తండ్రికి చేదోడుగా ఉంటూ.. కూటమి విజయానికి కష్ట పడి పని చేసిన వారికి గుర్తింపు ఇవ్వటంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. నాటి యువగళం నేటి అధికారం వెనుక ముఖ్య భూమిక పోషిస్తే...లోకేష్ – టీడీపీ భవిష్యత్ కు పునాదిగా నిలిచి ఏపీలో సరి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది.

### ముగిసిన ప్రజాప్రతినిధుల

## శిక్షణ కార్యక్రమం

### ఎంపీడీవో ఎన్ కీర్తి స్పందన





**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలో గ్రామాల సుపరిపాలన సుస్థిర వృద్ధిపై శిక్షణ తరగతులు ముగుసాయని రాయవరం ఎంపీడీవో ఎన్ కీర్తి స్పందన తెలిపారు. మండల కేంద్రమైన రాయవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎన్ కీర్తి స్పందన ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధిపై శిక్షణ తరగతులు అధికారులకు ప్రజాప్రతినిధులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామాల సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి పై శిక్షణ తరగతులు ముగుసాయని అన్నారు. చెత్త నుండి సంపద సృష్టి అలానే భూగర్భజలాలు అభివృద్ధి ఇతర ప్రయోజనాల కోసం వర్షపు నీటిని సేకరించడం,నిల్వ చేయడం మరియు ఉపయోగించడం కోసం ఉపయోగించే సాంకేతికతని,వర్షపు నీరు పైకప్పులు మరియు లేదా భూమి పైన ఉన్న ఇతర మానవ నిర్మిత గట్టి ఉపరితలాల నుండి సేకరించబడుతుందని,దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వీటితో పాటు మహిళా సాధికారత,పర్యావరణ పరిరక్షణ,ప్రకృతి వనరులు సంరక్షణ వాతావరణంలో మానవ ప్రభావం లేని ప్రదేశాలలో సహజంగా సహజ వనరులు ఏర్పడతాయని, సహజ వాతావరణము ప్రకృతి పరిసర ప్రాంతాలు,వాటి జీవన వైరుధ్యాల్ని బట్టి సహజ వనరులను వర్ణించడం జరుగుతుందని అన్నారు. ఈ సహజ వనరులనే ప్రకృతి వనరులు అని కూడా అంటారు. ఉధారణకు భూమి,నీరు,మత్స్య సంపద,అడవులు, ఖనిజాలు, వాతావరణం, వర్షపాతం ఇవన్నీ ప్రకృతిలో భాగమే. అయితే ఈ వనరులన్నీ చాలా వరకు పరిమితమైనవి కానీ పెరుగుతున్న జనాభా అవసరాలకు వీటిని అపరిమితంగా వాడుతున్నాము అని,ఈ పరిమితం అయిన సహజ వనరుల దుర్వినియోగాన్ని నివారించడానికి సరైన యాజమాన్య విధానాలు అవసరం. అందువల్ల వలన సహజ వనరుల సక్రమ పంపిణీ జరిగి, ప్రజల జీవన విధానాలలో అభివృద్ధి జరుగుతుందన్నారు. భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించాలని అనే పలు అంశాలపై ఎంపీడీవో అవగహన కల్పించారు. నేటి ఆధునిక సమాజంలో సాంకేతికత నైపుణ్యాన్ని అలవర్చు కోవాలని సూచించారు.నేడు ప్రభుత్వ కార్యాలయాలలో ఆన్ లైన్ దరఖాస్తులు ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం వుంటుందని వివరించారు. మహిళలు పరస్పర సహకారం తో స్నేహపూర్వకంగా మెలగాలని ఎంపీడీవో కీర్తి స్పందన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఐక్య క్రిస్మస్

## మహెూత్సవ వేడుకలు





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** ప్రేమ మార్గం ప్రభువు సందేశమని పారిశ్రామికవేత్త సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలో చెల్లూరు గ్రామం మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు జె సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఐక్య క్రిస్మస్ మహెూత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ డానియల్ పాల్, పారిశ్రామికవేత్త సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన బాటలో నడవాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. కుల మతాలకు అతీతంగా ఘనంగా చేసుకునే పండుగ క్రిస్మస్ అని తెలిపారు. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చేసుకునే అతిపెద్ద పండుగ అని తెలిపారు. క్రీస్తు ఆశీస్సులు మన అందరికీ ఉండాలని కోరునట్లు ఆయన అన్నారు. జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ డానియల్ పాల్ మాట్లాడుతూ భక్తి అంటే నీ నాలుక అదుపులో ఉండాలి, హృదయం యోగ్యముగా ఉండటమే భక్తి అని, నిజమైన క్రిస్మస్ ఏమిటి అంటే ఇతరులకు సహాయం చేయడమని ఆయన అన్నారు. ప్రతి క్రైస్తవుడు తన తప్పుడు తెలుసుకుని వాటిని సరిదిద్దుకొని సన్మార్గంలో నడవాలని ప్రతి ఒక్కరూ క్రీస్తు సందేశాన్ని ఆచరిస్తూ ముందుకు సాగాలని క్రైస్తవులకు సూచించారు. ఏ వ్యక్తి అయితే తన తప్పులను ప్రతిరోజు సరి చేసుకుంటారో ఆ వ్యక్తులు దేవుని అనతి కాలంలోనే చూడడం జరుగుతుందని డానియల్ పాల్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రిస్టమస్ వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రేమ బిందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం మండల పాస్టర్ పేలోషిప్ కార్యదర్శి ఎం ప్రభావకుమార్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల పాస్టర్లు, ఆయా గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### భారత్ గౌరవ్ అవార్డు అందుకున్న

## కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్





**కాకినాడసిటీ : విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. చిన్న వయసు ఎంపీగా, కాకినాడ జిల్లా అభివృద్ధిపై తనదైన మార్క్ చూపిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఇటీవల న్యూయార్క్ లో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న తొలి ఎంపీగా చరిత్ర సృష్టించగా తాజాగా ప్రతిష్టాత్మక భారత్ గౌరవ్ అవార్డును అందుకున్నారు. పిన్న వయసులోనే వ్యాపారవేత్తగా రాణించి ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సేవల ను గుర్తించిన భారత్ గౌరవ్ అవార్డు ఫౌండేషన్ నిర్వాహకులు భారత్ గౌరవ్ అవార్డును అందజేశారు. బుధవారం న్యూఢిల్లీలో ఒక ప్రైవేట్ హెూటల్లో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి చేతుల మీదుగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఈ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 5 మంది ఎంపీలకు ఈ అవార్డును ప్రధానం చేయగా అందులో కాకినాడ ఎంపీ కి స్థానం దక్కడం గమనార్హం. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ భారత్ గౌరవ్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. వ్యాపారవేత్తగా రాణిస్తున్న తనను గుర్తించి రాజకీయంగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. భారత్ గౌరవ్ అవార్డు అందుకున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ను కూటమి నాయకులు,కార్యకర్తలు ఘనంగా అభినందించారు.

### రైతు సమస్యల పరిష్కారానికే

## రెవెన్యూ సదస్సులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తాసిల్దార్ ఐపి శెట్టి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పసలపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో పలువురు రైతులు భూ సమస్యలపై 7 దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కోరుకొండ మండలగ్రామాల విలీన

## ప్రక్రియ నిలుపదల చెయ్యండి



**కోరుకొండ, విశ్వంవాయస్ న్యూస్:** మండలంలోని బూరుగుపూడి గాడాల నిడిగట్ల మధురపూడి తదితర గ్రామాలను రాజమహేంద్రవరం రుడాలో విలీన ప్రక్రియ నిలుపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేస్తూ పంచాయతీలుగా కొనసాగేటట్లు చర్యలు తీసుకుని అభివృద్ధికి సహకరించాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ రాష్ట్ర మున్సిపల్ శాఖ మాత్యులు పొంగూరి నారాయణకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం మంత్రి నారాయణ రాజమహేంద్రవరం లోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం విచ్చేశారు. మధురపూడి విమానాశ్రయంలో బత్తుల,మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి కోరుకొండ మండలంలోని గ్రామాలను విలీన ప్రక్రియ నిలుపుదల చేసి, పంచాయతీ ఎన్నికలకు అనుమతించాలని తద్వారా కేంద్ర, రాష్ట్రప్రభుత్వ నిధులు వచ్చేటట్టుగా చేసి ఎన్డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మాత్యులు నారాయణ, కలెక్టర్ పి ప్రశాంతి, శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### గోదారి చెంత

## తాగునీటి చింత



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రతినిధిగోదావరి చెంతనే ఉన్నా కొవ్వూరు, నిడదవోలు వాసులకు గొంతు తడవడం లేదు. గుక్కెడు నీళ్లకోసం దశాబ్ధాలుగా కష్టాలు పడుతున్నా ప్రజల దాహార్తిని తీర్చటంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు గోదావరి నీటిని అందిస్తామంటూ కూటమి నేతలు హామీలు గుప్పించారుం. ఈ ఎన్నికలలో నిడదవోలు, కొవ్వూరులతో పాటు జిల్లావ్యాప్తంగా కూటమి నేతలు విజయ దుందుభి మోగించారు. నిడదవోలు కూటమి అభ్యర్థిగా గెలిచిన కందుల దుర్గేష్‌కు మంత్రివర్గంలోనూ చోట్టు దక్కింది. అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా నిడవోలు, కొవ్వూరు పట్టణ వాసులకు గోదావరి నీటిని అందించే ఎఐఐబి ప్రాజెక్టు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) నిధులతో మంజూరైన రూ.128 కోట్ల ప్రాజెక్టు ఎపుడు పూర్తి చేసి గోదావరి నీరందిస్తారో అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.కొవ్వూరు పట్టణంలో ఎక్కిళు కొవ్వూరు పట్టణంలో 50 వేల మంది జనాభా ఉంది. నియోజకవర్గంలో వేల ఎకరాల సాగుభూమి ఉంది. గోదారి చెంతనే ఉన్నా తాగు, సాగునీటికి బోరు నీరే ఆధారం. ఎక్కడో 200 కిలోమీటర్లు దూరంలో ఉన్న ప్రాంతాలకు గోదావరి నీరు అందిస్తామని పాలకులు హామీలు గుప్పిస్తుంటారు. కానీ గోదారి చెంతనే ఉన్న ప్రాంతాలకు నదీ జలాలను అందించేందుకు ఎందుకు శ్రద్ధ చూపరని ఇక్కడి వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కొవ్వూరు ప్రజలకు పురపాలక సంఘం ప్రతిరోజూ రెండుపూటలా తాగునీటిని సరఫరా చేస్తోంది. కానీ ఈ నీరు మున్సిపల్ వాటర్‌వర్కులో ఏడు బోర్లను ఏర్పాటు చేసి ఒక్కొక్క పూటకూ 21 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అయినా వేసవి వచ్చిందంటే పట్టణంలోని 22వ వార్డు పోతురాజు దిబ్బ, 15వ వార్డు బ్రిడ్జిపేట, ఒకటో వార్డు రాజీవ్ కాలనీ, ఆర్‌ఆర్ టౌన్‌షిప్, అచ్చాయమ్మ కాలనీల్లో తాగునీటి ఎద్దడి తప్పడం లేదు.

### బడుగు,బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపింది

## అంబేద్కర్ రాజ్యాంగం

**ఆత్మీయులుగా ఉందాం... కలకాలం కలిసుద్దాం**

**రాజ్యాంగం మన బడుగులకు మంచి అవకాశం ఇచ్చింది**

**మన జీవితాలను మనమే మార్చుకుందాం**

**విధానాల్లో మార్పు తెద్దాం... భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దాం**

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**వేడుకగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం**

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**





**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మనమంతా ఒకే కుటుంబం... ఆత్మీయులుగా ఉందాం... కలకాలం కలిసుద్దాం అంటూ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. స్థానిక జెఎన్ రోడ్డులోని ప్రభు తోటలో బుధవారం ఎస్టీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ పర్యవేక్షణలో...నగర టీడీపీ అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. మన పుట్టుక మన చేతిలో ఉండదని... కానీ ఎలా జీవించాలి అనేది మాత్రం మన చేతిలోనే ఉంటుందన్నారు. ఆ ఎలా బతకాలి అనేది మాత్రం మన రాజ్యాంగం మనకు స్పష్టంగా చెబుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేంత అద్భుతంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి పార్టీలకు అతీతనంగా అందరిని ఆహ్వానించడం జరిగిందన్నారు. ఇది మనందరి కలయికని, మనమంతా ఒకే కుటుంబ సభ్యుమన్నారు. ఇక్కడ చేసిన తీర్మాణాలన్నీ నెరవేర్చేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. రాజ్యాంగ బద్దంగా తన వచ్చిన పదవి ఐదేళ్లేనని, కానీ తనపై ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన వారందరికి అలాగే ప్రజలకు ఉన్న అభిమానం కలకాలమన్నారు. తాను కూడా ఒక బలహీన వర్గానికి చెందిన వాడినేనని అన్నారు. మన మూలాల మర్చిపోకూడదని హితవుపలికారు. విధానాల్లో మార్పు తెద్దాం... భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దామని పిలుపునిచ్చారు. బలహీన వర్గాలు ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఎన్నో ప్రయాసలు పడి బీసీ స్టడీ సర్కిల్ తెచ్చుకున్నామని నాటి ఘటనలను గుర్తు చేశారు. గత పాలకులు కమిషన్లు గురించి తప్పితే... సమస్యలు పట్టించుకోలేదని మండిపడ్డారు. బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో వివిధ సంస్థల సీఎస్ఆర్ నిధులతో మరుగుదొడ్లు మెరుగు పరిచామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమ్మేళనంలో ఇంకా తిలక్ కుమార్, డాక్టర్ కోమలి, కుడుపూడి పార్థసారథి, నయనాల కృష్ణారావు,డాక్టర్ కోమలి, సానబోయిన రామారావు, బుడ్డిగ శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు, మజ్జి రాంబాబు,బుడ్డిగ రాధా, ఆంటోని,ఛాన్ భాషా,శ్రీనివాస్, రొంగల శ్రీనివాస్, డాక్టర్ ఖండవల్లి లక్ష్మి, తాళ్లూరు రాజేంద్రప్రసాద్, యండి అబ్దుల్లా, చాపల చిన్నరాజు,ఈతలపాటి కృష్ణ, డాక్టర్ కె.కె సంజీవరావు,నీలాపు వెంకటేశ్వరరావు,దాస్యం ప్రసాద్, నొడగల సుధ, ఎల్.వి ప్రసాద్, కురగంటి సతీష్ తదితరులు మాట్లాడారు. తొలి దళిత కవి కుసుమ ధర్మన్న మనువరాలు కుసుమ రాజకుమారిని ఘనంగా సత్కరించారు. అనంతరం టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచపల్లి ప్రసాద్ ప్రవేశపెట్టిన తీర్మానాలను ముక్తకంఠంతో అందరూ ఆమోదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లోని విజేతలకు అతిధులుగా బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల చెందిన వారు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రపంచ శాంతి దూత ఏసుక్రీస్తు

### ఎమ్మెల్యే సత్యప్రభ





**శంఖవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రేమ, దయ, జాలి, కరుణ, శాంతి, త్యాగం వంటి సకల సద్గుణాలకు నిలువెత్తు ప్రతిరూపం ఏసుక్రీస్తు, వాటిని తన నిజ జీవితంలో ఆచరించి చూపిన గొప్ప దైవం ఏసుక్రీస్తు ప్రభువు అని ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ క్రీస్తు చరిత్రను ప్రస్తుతించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వజ్రకూటం యేసు సన్నిధి ప్రార్థన మందిరంలో సంఘ పాస్టర్ క్రిస్టియన్ రాజు, ఎలిజబెత్ రాణి దంపతుల ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదిన వేడుకలైన క్రిస్మస్ ను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్యప్రభ క్రీస్తు ప్రభువు జన్మ దినానికి సంకేతంగా క్రిస్మస్ జ్యోతిని వెలిగించారు. బర్త్ డే కేకును కత్తిరించి వాటిని క్రీస్తు ప్రభువు శరీరానికి సాదృశ్యంగా భావిస్తూ సంఘం సభ్యులకు ఎమ్మెల్యే తినిపించారు. ఈ వేడుకల్లోని భక్తులు అందరికీ ఏసుక్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆహూతులను ఉద్దేశించి క్రీస్తు జన్మదిన ప్రేమ సందేశాన్ని అందించారు. ప్రపంచ శాంతి దూత అయిన ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా ఓ పెద్ద పండుగ మాదిరిగా ఆనందం, సంతోషాల మధ్య అత్యంత భక్తి విశ్వాసాలతో ఘనంగా జరుపు కుంటారని ఆమె అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ మత విశ్వాసాలు ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా అభివృద్ధి చెందడం సంతోషదాయకం అన్నారు. ఇటువంటి కీర్తనీయమైన కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. సంఘంలోని వృద్ధులు, బీదలకు సంఘం యాజమాన్యం సమకూర్చిన వస్త్రాలను సంఘం తరఫున ఎమ్మెల్యే సత్యప్రభ తన చేతుల మీదుగా క్రిస్మస్ కానుకగా బహూకరించారు. సుమారు 35 సంవత్సరాల క్రితం వజ్రకూటంలో ఒక్క సంఘ సేవకునితో ప్రారంభమైన యేసు సన్నిధి ప్రార్థన మందిరం దిన దిన అభివృద్ధి చెందుతున్న క్రమంలో నూతనంగా నిర్మించిన ఈ చర్చి నిర్మాణ అభివృద్ధికి రూ. 1,000,00 లను స్వర్గీయ తెలుగు దేశం పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంఛార్జి వరుపుల రాజా పేరు మీదుగా సంఘం యాజమాన్యానికి స్వచ్ఛంద విరాళంగా అందజేస్తామని వజ్రకూటం మాజీ సర్పంచ్, ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్ ఈ క్రిస్మస్ వేడుకల సందర్భంగా స్వచ్ఛందంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టి.ఎన్.టి.యు.సి. ఉపాధ్యక్షులు వెన్నా ఈశ్వరుడు (శివ), మాజీ సర్పంచ్ కండిపల్లి సూర్యనారాయణ, గ్రామ తెలుగు దేశం నాయకులు సకురు విష్ణుమూర్తి, కేళంగి బుచ్చిరాజు, శ్రీపతి వెంకటరావు, తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## సిపిఎం పార్టీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఎం పార్టీ ప్రధమ మహాసభ అమలాపురంలో స్థానిక ప్రెస్‌క్లబ్ నందు బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సిపిఎం పార్టీ జిల్లా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ గా కారెం వెంకటేశ్వరరావు కమిటీ సభ్యులుగా కె . కృష్ణవేణి జి,డాక్టర్ చల్లా రవికుమార్ ,డి వి రావు దుర్గా ప్రసాద్ .ఎన్ బలరాం ,టి. నాగ వరలక్ష్మి ఎస్ జ్యోగేష్ డి ఎ లక్ష్మి జిల్లా కమిటి సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది .నూతనం గా ఎన్నికైన కమిటీని నాయకులు కార్యకర్తలు అభినందించారు.



### ప్రభుత్వ విధానాలపై
## అమలాపురంలో ఎమ్మెల్సీ తోట తీమూర్తులు ఫైర్

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జరిగిన బడ్జెట్ సమావేశాల్లో సీఎం చంద్రబాబు ఇసుక,మద్యం అక్రమాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు. కానీ గ్రామ స్థాయిలో జరిగేది వేరు.ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు ప్రతి మద్యం షాపులోను ఎమ్మెల్యేలకు పావలా వాటా ఉంది ఎమ్మెల్యేలే బెల్ట్ షాప్ లు నడిపిస్తున్నారు,ప్రతి ఊరిలోను నాలుగుకి తక్కువ కాకుండా బెల్ట్ షాప్ లు ఉన్నాయని,ఎమ్మెల్సీ తోట.అన్నారు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను సూపర్ చీటింగ్ చేశారు.. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం నిజస్వరూపం బయటపడింది, నీకు 15 వేలు,నీకు 18 వేలు రైతుకు 20 వేలు సాయమన్నారు. ఏది సాయం,తొందర్లోనే ప్రజలు గుణపాఠం చెప్తారు, ఎమ్మెల్సీ తోట, పెన్షన్, ఇసుక, బెల్ట్‌షాప్‌ల విషయంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇసుక విచ్చలవిడిగా అక్రమ రవాణా జరుగుతుంది.







విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

### ఎ.బి.సి.డి.అవార్డ్స్ అందుకున్న
## కోనసీమ జిల్లా పోలీస్ అధికారులు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ ఎ.బి.సి.డి.అవార్డులకు ఎంపికైన డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ అధికారులు, జిల్లా అధికారులకు అభినందనలు తెలిపి బహుమతులు ప్రశంసాపత్రాలు అందచేసిన ఆంధ్రప్రదేశ్ డీజీపీ. 18.12..2024 న మధ్యాహ్నం మంగళగిరి డిజిపి ప్రధాన కార్యాలయంలో నేర పరిశోధన రంగంలో, కేసుల త్వరతి గతిన పరిష్కారానికి ఆధునాతన విధానాలను పాటించి వినూత్న మార్గాలను అనుసరించిన పోలీస్ అధికారులను గుర్తించి, వారిని ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డైరెక్షన్) అవార్డ్స్ ద్వారా డిజిపి ద్వారకా తిరుమలరావు అభినందించి సత్కరించారు. డాక్టర్ బి అర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఐపిఎస్ వారి నేతృత్వంలోని టీమ్ "అమలాపురం తాలుకా పోలీస్ స్టేషన్ సిఅర్.నెంబర్ : 181/2024లో నిందితులుగా ఉన్న అంతర రాష్ట్ర దొంగల ముఠా కేసును విజయవంతంగా చేధించినందుకు గాను, రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు, జిల్లా ఎస్.పి కి, ఎ . బి.సి.డి.అవార్డును ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బి అర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఐ.పి.ఎస్ ని మరియు ఈ కేసులో దర్యాప్తులో పాల్గొన్న ఇతర అధికారులు అయిన అమలాపురం డి.ఎస్.పి టి.ఎస్.అర్.కె.ప్రసాద్, రూరల్ ఇన్స్పెక్టర్ పి. వీరబాబు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ డి. ప్రశాంత్, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ వై . శేఖర్ బాబు మరియు సిబ్బందిని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు అభినందించడం జరిగినది.

## జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలి

### ఇన్చార్జ్ మంత్రి అచ్చెంనాయుడు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్చార్జి మరియు వ్యవసాయ సహకార, మార్కెటింగ్ పశుసంవర్ధక డైయిరీ డెవలప్మెంట్, మత్స్య శాఖల మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్ననాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో ప్రాథమిక రంగసెక్టార్, వాటి అనుబంధ రంగాలైన వ్యవసాయం, నీటిపారుదల, పశుసంవర్ధనం, డైయిరీ డెవలప్మెంట్ ఉద్యాన, మత్స్య విభాగాల తోపాటుగా ఉచిత ఇసుక పాలసీ ద్వారా ఇసుక సరఫరా, ధాన్యం కొనుగోలు, జలవనరులు ప్రక్రియ, దీపం 2 పథకం, పెంచిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యు మెంట్ తదితర అభివృద్ధి అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ మంత్రి మాట్లాడుతూ కోనసీమ జిల్లా అన్ని రకాలుగా సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, ఈ విష యంలో అధికారులు ప్రజాప్రతినిధులు పరిపూర్ణంగా సమన్వయంతో సహకరించాలని మంత్రి కోరారు. జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించేందుకు అందరి మద్దతు అవసరమన్నారు వ్యవసాయంలో అధునాతన సాంకేతికత నూతన వరి వంగడాలు హైబ్రిడ్ కొబ్బరి వంగడా లను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నారు స్థానిక ప్రజానీకానిక తలసరి ఆదాయం రూ. లక్ష 80వేలుగా ఉండి 22వ స్థానంలో నిలిచిందని దీన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు విశాఖపట్నం విజయవాడలో తలసరి ఆదాయం రూ. రెండు లక్షల 70 వేలుగా ఉందన్నారు. వ్యవసాయ ఆధారి త జిల్లాగా పేరు గాంచిన కోనసీమ జిల్లాలో వ్యవ సాయ అనుబంధ రంగాల కొబ్బరి ఉత్పత్తులను విలువ ఆధారితగా మార్చే పరిశ్రమల స్థాప నకు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రాజోలు తూర్పు పాలెం నందు కొబ్బరి ఆధారిత ఎం ఎస్ ఎం ఈ రాయి తీలతో ప్రోత్సహించి ఉపాధి స్వయం ఉపాధి అవ కాశాలు కల్పించి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన కోనసీమ జిల్లాలో హర్బర్లు, జెట్టీలు, ఫిష్ లాండింగ్ సెంటర్లు ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వ యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు . పర్యాటకారంగానికి జిల్లా ఎంతో అనువైనదని ఆ దిశగా గ్రోత్ ఇంజన్ ప్రణాళికలతో ఒక ఏజెన్సీని తీసుకుని వచ్చి అమలు చేయటానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. టెంపులు సముద్ర ఏ ప్రాంతాలతో సర్క్యూట్ టూరిజంకు చర్యలు చేపడతామని తద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశాలతో పాటు ఆదాయం వస్తుందన్నారు. నరేగా పనులు స్థానికంగా లేవని నరేగాలో అదనంగా కాలువ డ్రైనేజీ పూడిక తీతలు జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు గుర్తిస్తూ ప్రతిపాదించి చేపడితే పని దినాలు మెటీరియల్ కాంపోనెంట్ లభించి గ్రా మాలు సర్వతో ముఖ అభివృద్ధికి మార్గం సుగ మం అవుతుందన్నారు. వ్యవసాయం వాటి అనుబంధ రంగాలైన ఆక్వా కల్చర్‌పై కూడా దృష్టిసారించి ఆక్వా జోన్ అభివృద్ధితోపాటుగా నాన్ ఆక్వా జోన్ నిబం ధనలను తూచా తప్పకుండా పాటిస్తూ అక్రమ చెరువులకు ప్రభుత్వ రాయితీలను నిలుపుదల చేయాలని సూచించారు. ఏడాది పొడవునా మూడు పంటలు పండే సార వంతమైన భూములు ఆక్వా చెరువులు కింద మారకుండా ప్రభుత్వ నిబంధనలను తప్పనిస రిగా అమలు చేయాల న్నారు. వ్యవసాయానికి ఆమోదయోగ్యంగా లేని పల్లంగా ఉన్న చౌడు పర్ర భూములను మాత్రమే ఆక్వా జోన్లో తీసుకోవాలన్నారు స్థానికంగా జిల్లా కార్యాలయాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు నిర్ణయాలు తొందరగా తీసుకోవాలని తాత్సారం చేయకుండా నూతన జిల్లా అభివృద్ధికి అంకుటిత దీక్షతో పని చేయాలని సూచించారు. ముందుగా రోడ్ల విస్తరణ చెందితే అభివృద్ధి అనేది సాధ్య పడుతుందన్నారు. కౌలు దారులకు ఆమోదయోగ్యమైన చట్టాన్ని ప్రభుత్వం త్వరలో తీసుకు రానున్నదన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నకు సమాధామిస్తూ రాయవరం అమలాపురం రైతు బజార్లు ఎస్టేట్ అధికారులను నియమించి పునప్రారంభించాలని ఆదేశించారు. రైతులు ఖరీఫ్ వరి సాగు మూలంగా తుఫాన్లు వరదలు మూలంగా కొంతమేర నష్టాలు చవిచూస్తూ ఆ యొక్క నష్టాన్ని రబీలో భర్తీ చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారని ఆ దిశగా అధికారులు మంచి వంగడాలు పుష్కలంగా ఎరువులు బఫర్ స్టాకులు పెట్టుకొని డిమాండ్కు అనుగుణంగా సరఫరా చేయాలన్నారు. కోకోనట్ బోర్డుల కార్యాలయాలు స్థాని కంగా ఏర్పాటు చేసేం దుకు చర్యలు చేపడ తామని తద్వారా కొబ్బరి పరిశ్రమల ఏర్పాటుకు సౌలభ్యం ఏర్పడుతుందన్నారు. ఏడు ఫిషింగ్ ల్యాండ్ సెంటర్లు అభి వృద్ధికి చర్యలు తీసుకుం టామన్నారు. తుఫాన్లు వరదలు సమయంలో పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడకుండా వరిగడ్డిని సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని పశువులకు అవసరమైన మందులు ఆన్లైన్ లో ఇండెంట్ పెడితే సరఫరా చేయడం జరుగుతుంద న్నారు. జలవనరుల శాఖ సమీక్షలో సుదీర్ఘకాలంగా కాలువలు డ్రైనేజీలలో పూడికతీతలు పనులు సంబంధించి ఎమ్మెల్యేలు అధికారులు సమన్వయంతో ప్రాధాన్యత క్రమంలో ఆమోదయోగ్య మైన పనులు ప్రతిపాదిస్తే నిధులు సమీకరణకు పై స్థాయిలో చర్యలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీలు ఐవి రావు తోట త్రిమూర్తులు కే సూర్యనారాయణ రావు, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు, అయితా బత్తుల ఆనందరావు దేవ వర ప్రసాద్ గిడ్డి సత్యనారాయణ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


## టిడ్కో సమస్యలపై చైర్మన్‌కు వినతి





**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో అల్లవరం మండలం బోడసకుర్రు –దేవర్లంక లో టిడ్కో భవనాలులు నిర్మించి లబ్ధిదారులు కు ఇచ్చారు.టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్ గృహాలు, మౌలిక సదుపాయాలు పరిశీలించారు. ఈసందర్భగా టిడ్కో చైర్మన్ కు టిడ్కోగృహ లబ్ధి దారులు యు.నూకరత్నం, సి హెచ్ దేవి వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో "ఏ "కేటగిరి లోరూ. 3,65000,బి "2,65,000లు బ్యాంకు రుణాలు ఇచ్చారని వాయిదాలు కట్టే పరిస్థితులు లేవని రుణాలు రద్దు చేయాలి. తాగు నీరు, వాడకం నీరు,సక్రమంగా వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలి. డ్రైనేజ్, హాస్పిటల్, ఏర్పాటు.స్మశానానికి స్థలం కేటాయింపు చేయాలి అని వినతి పత్రంలో కోరారు. అలాగే టిడ్కోలో ఒకరు మరణిస్తే శవం దహనం చేయడానికి స్థలంలేక 5రోజులు ఫ్రిజర్ లో ఉంచిన విషయం పురపాలక కౌన్సిలర్ గండి దేవి హారిక కౌన్సిలో ప్రస్తావించిన విషయం కూడా వినతి పత్రంలో వివరించారు.చైర్మన్ వినతి పత్రంలో అంశాలు పై సానుకులంగా స్పందించి, సమస్యలుపరిష్కరిస్తాను అన్నారు.

## జ్ఞాన జ్యోతి శిక్షణను విజయవంతం చేయండి



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్:** పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ఉద్దేశించిన జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ డిఆర్పిల రిఫ్రెష్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాము విజయవంతం చేయాలని సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పిలుపునిచ్చారు. గతేడాది సెప్టెంబర్లో జిల్లా వ్యాప్తంగా 132 మంది డిఆర్పి లకు సెక్షన్ ఇచ్చామని డిఆర్పి లకు రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ ను గురువారం నుంచి మూడు రోజులపాటు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ట్రైనింగ్ సెంటర్‌ను ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోర్స్ కోఆర్డినేట ర్ బి రమణశ్రీ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి హనుమంతరావు తో కలిసి ఆయన ట్రైనింగ్ సెంటర్ ను సందర్శిం చారు. ట్రైనింగ్ సెంటర్లో మౌలిక సదుపాయాలను, ట్రైనింగ్ ప్రోగ్రామ్కు అవసరమైన ఐఎఫ్పిలు వర్కింగ్ కండిషన్లో ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. జిల్లాలో ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన ముగ్గురు ఉపాధ్యాయులు, అలాగే గతంలో శిక్షణ పొందిన ప్రతి మండలం నుంచి ముగ్గురు ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఈ ట్రైనింగ్ లో పాల్గొంటారన్నారు. మూడు రోజులపాటు కోర్స్ కోఆర్డినేటర్ రమణశ్రీ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ లో పాల్గొనే వారికి వర్కింగ్ లంచ్ వెండర్ ప్రొవైడ్ చేస్తారన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో
## అధిక దిగుబడులు



**బాపట్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామంలో చందొలు సుశీల మినీ ఎన్ పి ఎం షాపు నందు ఆవు మూత్రం 20 లీటర్లు,10 లీటర్లు నీరు,5 కేజీల వేపాకు,5 కేజీలు జిల్లేడు ఆకు లు,2 కేజీల వెల్లుల్లి,3 కేజీల పచ్చిమిర్చి తో అజ్ఞాస్త్రం తయారు చేశారు.ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ నిలం ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ అజ్ఞాస్త్రమును అన్ని రకాల పంటలపై పురుగు నివారణ కొరకు వాడటం జరుగుతుందని, అన్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుంది ప్రత్యేకంగా రైతు సాధికార సంస్థ ద్వారా జీరో బడ్జెట్ నేచురల్– ఫార్మింగ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ –ఫార్మింగ్ కార్యక్రమాలను అమలు చేస్తుంది. రైతుల సంక్షేమం వినియోగదారుల సంక్షేమం పర్యావరణ పరిరక్షణ వంటి బహుళ లక్ష్యాలతో ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. అధిక ధర కలిగిన కృత్రిమ ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా ప్రకృతికి అనుగుణంగా గో మూత్రం, గో పేడ, వేపాకులు,స్థానిక వనరు లతో ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, అజ్ఞాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి వాటిని తయారు చేసుకుని వ్యవసాయంలో ఉపయోగించుకోవాలి అని అందువల్ల నేలలో జీవపదార్థం అధికమవటమే కాక మొత్తంగా భూసారం పెరుగుతుంది ప్రకృతి వ్యవసాయం ద్వారా మానవ ఆరోగ్యమే కాక నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎల్ 2 సి హెచ్ సునీత,ఐసిఆర్ పిఎస్ లు పరిశ ప్రసన్న,చందోలు సుశీల తదితరులు పాల్గొన్నారు

### ఆర్థిక ఇబ్బందులు పడుతున్న
## రెండు కుటుంబాలకు రూ.35 వేలు ఆర్థిక సహాయం

### కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రెండు కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.35 వేలు ఆర్థిక సహాయం అందించి మరోసారి మానవత్వం చాటుకున్నారు. రామచంద్రపురం నియోజవర్గంలోని కాపవరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వనుం లక్ష్మి కుటుంబానికి ఆసరాగా రూ.15 వేలు రూపాయలు ఆమె భర్త వనుం నాగేశ్వరావుకు అందజేశారు.అలాగే ఇటీవల కాలంలో రామచంద్రపురం నియోజవర్గంలోని కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో పిడుగు పడి మృతి చెందిన నంది కోళ్ల వీరస్వామి భార్యకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు.భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఉన్న కుటుంబానికి,ఆర్థిక పరిస్థితులతో సతమతమవుతూ అనారోగ్యం బారిన మంచాన పడిన కుటుంబానికి తన వంతు సాయంగా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని మంత్రి సుభాష్ తెలిపారు. కష్టకాలంలో ఉన్న అభాగ్యులను, దీనులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి మానవత్వం అని అన్నారు.ఆర్థిక సహాయంతో పాటు, మనో ధైర్యంగా ఉండాలని ఓదార్పు చెప్పారు.ఒక ప్రక్క ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తూనే, వ్యక్తిగతంగా కూడా ఆర్థిక సహాయం అందించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సినీ ఫక్కీలో గోల్డ్ షాపులో తుపాకీతో బెదిరించి ఆభరణాల చోరీ



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలో పట్టపగలు ఒక దొంగ తుపాకీతో హల్‌చల్ చేసి బంగారం షోరూమ్ లోకి చొరబడి ఉద్యోగిని బెదిరించి ఆభరణాలు దోచుకెళ్లిన వైనం..!!. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఏటివార రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకొని, అతడి వద్ద నుంచి తుపాకీతో పాటు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుని వద్ద డమ్మీ తుపాకిగా గుర్తించి స్వాధీనం చేసుకుని వన్ టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## వైసీపీని వీడిన చెల్లూరు పంచాయితీ వార్డు మెంబర్లు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్:** మండలం చెల్లూరు గ్రామపంచాయితీ 4వ వార్డు పంచాయితీ సభ్యులు లంకలపల్లి సూర్యకుమారి శ్రీనివాస్, 7వ వార్డు మెంబరు దొండపాటి మేరికమల లక్ష్మణరావు, 10వ వార్డు మెంబరు బొక్కా సత్యనారాయణ, 15వ వార్డు మెంబరు కుమారి కురుపూడి లీలాదేవి లు వైసీపీకి రాజీనామా చేశారు. చెల్లూరు టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు చంద్రు రాజు ఆధ్వర్యంలో బుధవారం మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో తెలుగు దేశం పార్టీలోకి చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం చెల్లూరు గ్రామానికి చెందిన కురుపూడి రాజు కు జ్యోతిష్య శిరోమణి అవార్డు వచ్చిన సంధర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి, అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవు శ్రీను, మోరంపూడి రాజ్ కుమార్, కొప్పిశెట్టి సత్యనారాయణ (డ్రైవర్ శ్రీను), కురుపూడి నాగరాజు, దార్ల రమేష్, కాదా శ్రీను, బవిరిశెట్టి అప్పారావు, పసల విధ్యాధర్, కొమ్ము సత్తిబాబు, తదితర్లు పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

**మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది**

**తాల్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండల పరిధిలోని ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ శాఖ అధికారులు బిగించారు. విద్యుత్ శాఖ జేఈ నాగరాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ఎంత విద్యుత్ వినియోగం అవుతుంది, ఎంత బిల్లు రీడింగ్, ఓవర్ లోడ్ వంటి వివరాలు స్మార్ట్ మీటర్లు సులువుగా తెలియపరుస్తాయని అన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు మొబైల్ ఫోన్ రీఛార్జ్ లాగా విద్యుత్ రీఛార్జ్ చేసుకునే విలుసుబాటు ఉంటుందని, త్వరలో అన్ని గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని, సోలార్ విద్యుత్తు ఉన్న గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ టీవివి సత్యనారాయణ, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు



## కాకినాడ నగరంలో ఎగ్జిబిషన్ ప్రారంభం

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలోని మెక్లారిన్ గ్రౌండ్లో శ్రీదుర్గా ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం ఈ ఎగ్జిబిషన్ను పారిశ్రామికవేత్త గ్రంధి బాబ్జి ప్రారంభించారు. అండర్ వాటర్ టన్నెల్, జలకన్య వంటివి ఆకర్షణగా నిలిచాయి. ఎగ్జిబిషన్ గేటు సొర్ర చేప ఆకారంలో వెళ్లేందుకు మార్గంగా ఏర్పాటు చేశారు. సొర్ర చేప నోటిలోనికి వెళ్తున్నట్లుగా ఆహ్లాదంగా అరుదైన రీతిలో దీనిని డిజైన్ చేశారు. కాకినాడ నగర పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎగ్జిబిషన్ను తిలకించాలని బాబ్జి కోరారు. ఈ కార్యక్రమంలో కవుడ మాజీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణ నాయకులు బచ్చు శేఖర్, బొబ్బిలి గోవిందు, చింత మాణిక్యం, నేమాని సత్యనారాయణ, దవులూరు భద్ర రావు తదితరులు పాల్గొన్నారు



## అమిత్ షా రాజీనామా చేయాలి

**- దళిత జాతికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేవుడే...**
**- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**
**- తాటిపాక మధు**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** మనువాద మతోన్మాద కేంద్ర హెూం శాఖా మంత్రి అమిత్ షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ని పార్లమెంటులో ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడటం దుర్మార్గమైన దారుణమైన అహంకార చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు ఈ మతోన్మాద చర్యను తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రజలు, ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నిసార్లు అంబేద్కర్ అని పదే పదే అతడిని స్మరించుకుంటారు దానికి బదులుగా ఏదో ఒక హిందూ దేవుడిని స్మరించుకుంటే మీకు 7 జన్మలకు స్వర్గం దక్కుతుంది కదా అనటమే కాకుండా మాటి మాటికీ అంబేద్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఏగతాళిగా మాట్లాడటం తగదన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారం లోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పటం సిగ్గు చేటు. నేటి మనువాద మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగం పై, ప్రభుత్వరంగ సంస్థలపై దాడి చేస్తున్నారన్నారు. ఈ దాడులను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవలిసిన అవసరం ఉందన్నారు. దళిత పీడిత వర్గాలకు అంబేద్కర్ నిజంగా దేవుడని మధు అన్నారు. వెంటన్ అమిత షా రాజీనామా చేయాలని మధు డిమాండ్ చేశారు

## రైతులూ.. వరి కోతలను వాయిదా వేయండి

**- కోసిన వరి పంటను కుప్పలు వేయండి - కళ్ళాల్లో ధాన్యాన్ని ఒబ్బిడి చేయండి**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తమిళ నాడు తీరం వైపు పశ్చిమ వాయువ్య దిశగా అల్పపీడనం కదులు తోందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడన ప్రభావంతో ఏపీలో ముఖ్యంగా కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. నెల్లూరు, తిరుపతి, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కృష్ణ. బాపట్ల, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నైరుతి బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తమిళనాడు తీరం వైపు పశ్చిమ వాయువ్య దిశగా అల్పపీడనం కదులు తోందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అల్ప పీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యంగా కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, బుధవారం నెల్లూరు, తిరుపతి, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ వారంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలను కొద్ది రోజుల పాటు రైతులు వాయిదా వేసుకోవాలని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వ్యవసాయ అధికారి పడాల గాంధీ రైతులకు సూచించారు. శంఖవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి కోతలు, వరి పనలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కోసిన పంటను వెంటనే కుప్పగా చేసుకోవాలని, కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని జాగ్రత చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న బహు పంటల సాగును పరిశీలించి ప్రాముఖ్యతను వివరించారు. పంట భీమా పథకం, రబీ పంటలైన వరి, అపరాల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ సహాయకురాలు హిమ బిందు, రైతులు పాల్గొన్నారు.

## అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ మరింత వేగం పుంజుకోనున్నదన్న అచ్చెంనాయుడు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం జిల్లా కేంద్రం మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ లోని అభివృద్ధి అంశాలపై ప్రతిపాదనలు క్రోడీకరించి సమర్పించిన ఎడల ప్రణాళికా బద్ధంగా నావంతు సహకారం అందిస్తానని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్, పశువర్ధక డైరీ డెవలప్మెంట్ మత్స్య శాఖల మంత్రివ ర్యులు కె అచ్చెన్ననాయుడు తెలిపారు. బుధవారం స్థానిక మెట్ల రామలక్ష్మి కళ్యాణ వేదిక నందు అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధ్యక్షులుగా అల్లాడ స్వామి నాయుడు పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యంగా పాల్గొని మాట్లాడుతూ అముడా అధ్యక్షులుగా రాజకీయంగా 42 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన వ్యక్తిని ఎంపిక చేస్తూ ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని ఆ దిశగా అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ మరింత వేగం పుంజుకోనున్నదని ఆయన ఆకాంక్షించారు. పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలను గుర్తించి ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కేటాయించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం నీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయని రాబోయే రోజులలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికలు, జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలు, మార్కెటింగ్ సొసైటీలు టెంపుల్ కమిటీలు కూడా రానున్నాయని తెలిపారు. నూతనంగా ఏర్పడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మౌలిక వసతులు పరంగా మరింతగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు, పోలిట్ బ్యూరో సభ్యులురెడ్డి సుబ్రహ్మణ్యం మెట్ల రమణబాబు ప్రజా ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

### కూనవరం మండలంలో

## ఐటిడిఏ చింతూరు ప్రాజెక్ట్ అధికారి ఆకస్మిక పర్యటన



**కూనవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలం, కాచవరం గ్రామంలో నీ ఎంపీపీఏస్ స్కూల్ ను ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయుల కొరత గురించి పిల్లల తల్లిదండ్రులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సమస్యను వీలు అయి అంత త్వరగా పరిష్కరించడం జరుగుతుంది అని పిల్లల తల్లి దండ్రులు ఉద్దేశించి మాట్లాడి న్నారు. తదుపరి కూనవరం మండలం గ్రామ పంచాయతీ ముందు ఉన్న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ముంపుకు గురి అవుతున్న ఇళ్ల యొక్క స్ట్రక్చరల్ వాల్యుయేషన్ స్వయంగా ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు పరిశీలించారు. అదే విధంగా కూనవరం ప్రజలతో మాట్లాడుతూ ఇళ్ల సర్వే లో తేడాలు వచ్చిన ఇళ్లను మరల సర్వే చేయించడం జరుగుతుంది అని మరియు సర్వే కానీ వాళ్లకు త్వరలో ఇళ్ల సర్వే చేయించడం జరుగుతుంది అని ఈ సందర్భంగా చెప్పినారు. ఇళ్ల సర్వేతో పాటు చెట్లు మరియు ఇతర కట్టడాల యొక్క వాల్యుయేషన్ పని కూడా మొదలు పెట్టడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఏస్డిసి చింతూరు వారి మరియు రవితేజ, డిఇ,పిఆర్ మరియు పంచాయతీ సెక్రటరీ వారి పాల్గొన్నారు. తదుపరి కోతుల గుట్ట కేజీవీవీ స్కూల్ను సందర్శించి స్కూల్ పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులతో స్కూల్ నందు సమావేశం నిర్వహించారు. తదుపరి స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులతో ముచ్చటించి జీవితంలో గొప్ప గొప్ప లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి అని పేర్కొన్నారు. తర్వాత అంబేద్కర్ ఏస్డిసి మాట్లాడుతూ విద్యార్థులు ఈ దశలో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చు అని చెప్పినారు. నేను కూడా గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకున్నాను అని ఈ సందర్భంగా పాత రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఏస్ డి సి, చింతూరు వారు, మరియు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏడుగురాళ్లపల్లి


## గ్రామ పంచాయతీలో రెవెన్యూ సదస్సులు




**చింతూరు డివిజన్, విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి జిల్లా చింతూరు మండలం ఎదుగురాళ్ళపల్లి గ్రామ పంచాయతీ పరిదిలో గల కాటుకపల్లి , ఏడుగురాళ్లపల్లి , మద్దిగూడెం గ్రామములలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగినది. ఈ గ్రామ సభకు రెవిన్యూ సదస్సుల స్పెషల్ ఆఫీషర్ కె.సుజాత మరియు తహసీల్దార్ యస్. చిరంజీవి బాబు, ఆర్. ఐ విగ్నేష్ మండల సర్వేయర్ గోవిందరాజు, గ్రామ రెవిన్యూ అధికారి సిహెచ్ మోహన్, గ్రామ సర్వేయర్లు మరియు మెడికల్ డిపార్ట్మెంట్ కిషోర్ కుమార్ ఒప్తలమిక్ ఆఫీసర్ మరియు లక్ష్మి, స్వరూపా రాణీ సిబ్బంది గ్రామ సభలుకు హాజరు అయ్యినారు. ఇందులో భూమి సంబంధిత సమస్యల అనగా, ఆన్లైన్ నమోదు కొరకు, పట్టా మార్పుల కొరకు, అసైన్ మెంట్ పట్టాలు కొరకు, భూమి సర్వే కొరకు, విస్తీర్ణం తప్పులు, కొత్తగా పాస్ పుస్తకం కొరకు పట్టాలు కొరకు దరఖాస్తులు తీసుకోవటం జరిగినది, రెవిన్యూ దరఖాస్తులు. 63 వచ్చాయి మెడికల్ సంబంధించి 41 మంది చెకప్ చేయించుకున్నారు.

## తొండంగి మండలానికి విద్యుత్తు సెక్షన్ మంజూరు

**19 ఉద్యోగాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలిలో అనేక పరిశ్రమలు ఏర్పాటు అవుతూ ఉన్నాయి. ఇప్పటికే ప్రముఖ ఫార్మా కంపెనీలు ఈ మండలంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. కాకినాడ గేట్ వే పోర్టు నిర్మాణం జరుగుతోంది. ఈ మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ విద్యుత్తు సరఫరాలో నిత్యం ఇబ్బందులు ఏర్పడు తున్నాయి. పారిశ్రామిక అవసరాలతోపాటు గృహ విద్యుత్తు వినియోగం పెరగడంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు నెలకొంటున్నాయి. వీటిని సకాలంలో సరి చేసేందుకు తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. విస్తీర్ణం పరంగా పెద్ద మండలం కావడంతో విద్యుత్తు సరఫరాలోని తాత్కాలిక అంతరాయాలను ఎప్పటి కప్పుడు సకాలంలో సరిదిద్ద లేని పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో తొండంగి మండలానికి విద్యుత్తు సబ్ స్టేషన్ సెక్షన్ ఏర్పాటు చేయాలని కాకినాడ సర్కిల్ ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీరు జి.ప్రసాద్ ప్రతిపాదనలను పంపారు. దీనికి సీఎండీ పృథ్వీతేజ్ ఆమోదం తెలిపారు. తొండంగి కేంద్రంగా సెక్షన్ ఏర్పాటుకు సిబ్బందిని కేటాయించారు. 19 పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సహాయక ఇంజనీరు, జూనియర్ ఇంజనీరు, లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్, అయిదుగురు అసిస్టెంట్ లైన్మెన్లు, పది మంది ఎనర్జీ అసిస్టెంట్లు (జేఎల్ఎం-గ్రేడ్ 2) పోస్టులతో త్వరలో సెక్షన్ను నెలకొల్ప నున్నారు. ఏన్నో ఏళ్లుగా తొండంగి మండలంలోని అన్ని గ్రామాలు అన్నవరం విద్యుత్తు సెక్షన్ పరిధిలోనే ఉన్నాయి. దీనిలో అన్నవరం, అన్నవరం దేవస్థానం, కత్తిపూడి, కృష్ణాపురం, ఎర్రయ్యపేట, ఏవీ.నగరం గ్రామాల్లో విద్యుత్తు ఉప కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అన్నవరం సెక్షన్లో తొండంగి మండలంలోని రావికంపాడు, పీఈ. చిన్నాయిపాలెం, తమ్మయ్యపేట, బెండపూడి, ఎ. కొత్తపల్లి, శృంగవృక్షం, సీతారామపురం, కొమ్మనాపల్లి గ్రామాలు యథావిధిగా కొనసాగుతాయి. కృష్ణాపురం, ఎర్రయ్యపేట, ఏవీ నగరం విద్యుత్తు ఉప కేంద్రాలు ఉన్న మిగతా అన్ని గ్రామాలను తొండంగి సెక్షన్ పరిధిలోకి తీసుకువచ్చారు. దీని ద్వారా తొండంగి మండలంలో లోఓల్టేజీ సమస్య, అదనపు ట్రాన్స్ ఫార్మర్లు, లైన్లు వంటి వాటిని సాకారం చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. తొండంగి మండలానికి తాజాగా విద్యుత్తు సబ్స్టేషన్ సెక్షన్ మంజూరు నేపథ్యంలో వీలైనంత త్వరగా తొండంగి సెక్షన్ ఏర్పాటు చేసి, ఆపై కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఈపీడీసీఎల్ కాకినాడ సర్కిల్ ఎస్ఈ ప్రసాద్ ప్రకటించారు.

## అక్రమ భూ కబ్జాలు, కట్టడాలను ఉపేక్షించేది లేదు..

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్**




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణ పరిధిలో కొంతమంది రాజకీయ ప్రతినిధులుగా చెలామణి అవుతూ ప్రభుత్వ స్థలాలను సైతం కబ్జాలు చేసి లేఅవుట్లు, భవనాలు నిర్మిస్తూ ప్రభు త్వానికి చెడ్డపేరు తెస్తున్నారని, వాటిని ఉపేక్షించేది లేదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. బుధవారం అమలాపురంలోని కాపు కళ్యాణ మండపంలో జరిగిన అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్గా అల్లాడి స్వామినాయుడు ప్రమాణ స్వీకార మహెూత్సవ కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని మాట్లాడారు. ఈ ప్రమాణ స్వీకార మహెూత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన శాసనసభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సాగు చేసే ప్రతి రైతుకు నీటి సంఘాల ఎన్నికకు ఓటు హక్కు కల్పించాలి

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్:** రైతుల అభివృద్ధికి దోహదపడే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కుయ్యేరు గ్రామంలో జిల్లా కార్యదర్శి రాజబాబు మాట్లాడుతూ రైతుల సంక్షేమం ధ్యేయంగా సహకార సంఘాలు ఏర్పడ్డాయని ప్రతి సహకార సంఘాలలోనూ భూములు వున్న ప్రతి రైతు సభ్యులుగా ఉండాలని వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్దేశంతో సహకార సంఘాలు ఏర్పడ్డాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేషన్ పద్ధతిపై కార్యకర్తలను నియమించారన్నారు. నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో సహకార సంఘాల అభివృద్ధి కుంటు పడిందన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని నిశ్చయంతో ప్రభుత్వం సహకార సంఘాల వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. అయితే ప్రభుత్వాలు కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని ఉద్దేశంతో నామినేటెడ్ పదవులు ఇస్తుందన్నారు. రైతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సహకార సంఘాల ఎన్నికలను నామినేటెడ్ పద్ధతిపై కాకుండా పోటీ పద్ధతి పై నిర్వహించినట్లయితే రైతులు ఆర్థిక అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. సాగు చేసే ప్రతి కౌలు రైతుకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. సహకార సంఘాల పదవులు రాజకీయ నిరుద్యోగులకు కాకుండా సాగు చేసే రైతులు కౌలు రైతులు ఇచ్చినట్లయితే ఆ సంఘాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



**చింతూరు డివిజన్, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఇంటర్ బోర్డు వారు ప్రభుత్వ కళాశాలలో చదువుకునే ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడం కోసం ప్రారంభించిన సంకల్ప్ 2025 కార్యక్రమంలో భాగంగా, ఉచిత స్టడీ మెటీరియల్స్ను ప్రభుత్వ జూనియర్ కళాశాల చింతూరు నందు బుదవారం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పూర్తి ఏకాగ్రతతో చదువుకుని ఈ పరీక్షలలో అద్భుత ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అమ్మవారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో నూతనంగా నిర్మించబోయే శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.




## ముగిసిన సుస్థిర స్థిరఅభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు

**- ఎంపీడీవో బత్తిన**

**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండ మండల అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర,స్థిర అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు బుధవారంతో ముగిసినట్లు అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచులకు, సెక్రట రీలకు, వివిధశాఖల అధికారులకు 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో సుస్థిర, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులపాటు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి మహేశ్వర ప్రతాప్, ఏవో సామ్యూల్, భ్రమరాంబ, సూరమ్మ, ఝూన్సీ, రామ కృష్ణ, సెక్రటరీలు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.




విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY


### విద్యార్థి దశ నుండే

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**ప్రశ్నించడంతో సమాజంలో చైతన్యం పొందవచ్చు : డిసిపిసి సభ్యుడు గొట్టిముక్కల**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రతీ విద్యార్థి వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుబ్బారావుపేట లోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతిగృహంలో కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ముఖ్య అతిథిగా అనంతరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులోనే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రశ్నించడం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలన్నారు. మోస పోయిన వారికి న్యాయం చేసేందుకు వినియోగదారుల రక్షణ చట్టాన్ని భారత ప్రభుత్వం తీసుకు వచ్చిందని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ లు విద్యార్థుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అనంతరావు అన్నారు. మరో అతిధి విజిలెన్స్ కమిటీ సభ్యుడు ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

ప్రాథమిక చికిత్స పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వసతి, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## రీ-సర్వే రద్దు చేయండి భూ సమస్యలు పరిష్కరించండి

**- ప్రభుత్వ భూములకు డి పట్టాలు ఇవ్వండి- రైతుల ఆవేదన**



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోటికేశవరంలో గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో అధికారులు చేసిన తప్పిదాలు రైతుల పాలిట శాపంగా మారాయని, దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నట్లు తాసిల్దార్ సుస్వాగతం ముందు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోటి కేశవరంలో రెవెన్యూ సదస్సులో భాగంగా రైతులు 19సమస్యలను తాసిల్దార్ కు వినతిపత్రం రూపంలో అందజేశారు. సందర్భంగా రైతులు అడపా సుధీర్, వీరభద్రరావు, నేమాల ఏసు రత్నం తదితరులు పాత్రికేయులతో మాట్లా డుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో అధికారులు, రైతుల ప్రమేయం లేకుండా తప్పులు తడకలుగా సర్వే చేశారని, దీంతో రైతులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయన్నారు. రైతులకు ఉన్న భూమికి, రెవెన్యూ రికార్డుల్లో ఆన్లైన్లో చూపిస్తున్న దానికి పొంతన లేదన్నారు. కేశవరంలో చేసిన రిసర్వే రద్దు చేయాలని లేనిపక్షంలో రైతులు ఆధ్వర్యంలో మరోమారు రి సర్వే నిర్వ హిం చాలన్నారు. ప్రభుత్వ భూములు పొందిన సుమారు 100 మంది రైతులు ఎకరం నుండి రెండు ఎకరాల లోపు ఉన్న సన్న,చిన్నకారు రైతులు గత 40 సంవత్సరాల నుండి పొజిషన్లో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నారని, వారికి డీ పట్టాలు ఇవ్వాలని రైతులు తాసిల్దార్ కి తెలిపారు. ఈ విషయంపై తాసిల్దార్ సుస్వాగతాన్ని వివరణ కోరగా ఈ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి రజిని, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి, రెడ్డి పంతులు సత్రం ఈవో లక్ష్మణరావు, సర్పంచ్ సింధు కామేష్, గుడాల చిన్నయ్య,వీఆర్వోలు జ్యోతి, దయానందస్వామి, రాజేష్, వీఆర్ఏ రమణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### 21న జగన్ పుట్టినరోజు

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో ఈనెల 21 మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా మార్గాని ఎస్టేట్‌లో వైఎస్సార్ సీపీ క్రికెట్ లీగ్ పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని భరత్ ప్రకటించారు.మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు, మూడో బహుమతి కింద రూ.15 వేలుఅందజేస్తామన్నారు. టోర్నమెంట్‌కి సంబంధించిన పోస్టర్ ప్రెస్‌మీట్‌లో అయన ఆవిష్కరించారు.ఈ టోర్నీలో దాదాపు 100 జట్లు పాల్గొనే వీలుందన్నారు. టోర్నమెంట్ లో పాల్గొనేందుకు ఈ 9154368468 నెంబర్ కి సంప్రదించగలరు.

## నారాయణను మర్యాదపూర్వక కలిసిన బత్తుల



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖమాత్యులు పొంగూరి నారాయణను రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని పలు కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర మున్సిపల్ శాఖ మాత్యులు నారాయణ మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చియ్య చౌదరి, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు గంగిశెట్టి చంటిబాబు, కంటే నాగ నాగేశ్వరరావు తదితరులు నారాయణకు ఘనంగా స్వాగతం పలికారు

### ఆదిత్య విద్యార్థిని హరిప్రియ కు

## సర్వ లక్షణం నాట్య మయూరి అవార్డు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన హరిప్రియ కు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చిత్ర విశ్వేశ్వరన్ చేతుల మీదుగా మద్రాస్ లోని నంగనల్లూరు సభలో కూచిపూడి నృత్యానికి గాను "సర్వ లక్షణ నాట్య మయూరి" అవార్డు అందుకున్నారు. చిత్రావిశ్వేశ్వరన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవటం తాను అదృష్టంగా భావిస్తున్నానని హరిప్రియ చెప్పారు. హరిప్రియ తమ కళాశాలకు గర్వకారణం అనీ ,ఒక్కనాట్యంలోనే గాక అన్ని సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ, విద్యా విషయాలలోనూ, వక్తృత్వపు పోటీలోనూ, వ్యాసరచన పోటీలలోనూ ఇంకా ఎన్నో కార్యక్రమాల్లో ముందుంటుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కె .ఎన్.ఎన్. రెహమాన్ చెప్పారు.డాక్టర్ జి వి.ఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ హరిప్రియ ఎన్.ఎస్. ఎస్.లో కూడా వుండి చురుకుగా సేవలు చేస్తుందని, తను ప్రి యార్డి కి కూడా తర్ఫీదు పొందిందని తెలియజేశారు. హరిప్రియ యొక్క అనేక కళలు యూత్ ఫెస్ట్ ,ఇస్కాన్, రోటరీ వంటి పోటీలకు వెళ్ళి ప్రథమ స్థానంలో స్వర్ణ పతకాలు గెలుచుకున్నట్లు ఆయన చెప్పారు.కళాశాలలో జరిగే అనేక



సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగ పడుతున్నాయని, కూచిపూడి భరతనాట్యంలో నృత్యాలు చేసి,న్యాక్ టీం వచ్చినప్పుడు ప్రదర్శించి వారి ఆశీస్సులు పొందిందని సిహెచ్ ఫణి కుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు.డాక్టర్ బిహెచ్ వి.రమాదేవి మాట్లాడుతూ హరిప్రియ వంటి అమ్మాయిలు తల్లిదండ్రులకు కళాశాలకు తల మానికంగా ఆమె అభివర్ణించారు.ఆదిత్య య్నెక్క కీర్తి రాష్ట్రాలు దాటి, వ్యాప్తి చేస్తున్నందుకు ఛైర్మన్ డా. నల్లమిల్లి శేషారెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సుగుణా రెడ్డి హరిప్రియకు తమ శుభాశీస్సులు,శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిరాశ్రయ కేంద్రాలకు నిధులు కేటాయించాలి

**మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేత - సానుకూలంగా స్పందించిన మంత్రి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్రంలో ఉన్న 89 నిరాశ్రయ కేంద్రాలకు నిధులు అందించి ఆదుకోవాలని రాష్ట్ర నిరాశ్రయుల నిర్వహణ ఎన్జీవోల సంఘం తరపున మంత్రి నారాయణ ను కోరినట్లు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు.ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంత్రి నారాయణ ను కలిసి రాంబాబు రాష్ట్ర సంఘం తరపున వినతి పత్రాన్ని సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 89 నిరాశ్రయ కేంద్రాలు 2016లో ప్రారంభించగా ప్రస్తుతం 59 షెల్టర్ షెల్టర్లు నిధుల విడుదల కాక రెన్యువల్ చేయక స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాయని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు.20 నిరాశ్రయ కేంద్రాలు మున్సిపాలిటీల జనరల్ ఫండ్ తో నడుస్తున్నాయని మంత్రి నారాయణ కు నిరాశ్రయ కేంద్రాల సమస్యలను రాంబాబు వివరించారు .మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి నిధులు విడుదలకు తాను కృషి చేస్తానని నిర్వహణ బాగా చేయాలని కోరారు. నిరాశ్రయ కేంద్రాల అవసరం



ఎంతో ఉందని మరిన్ని నిరాశ్రయ కేంద్రాల ప్రారంభానికి కృషి చేస్తానని శీతాకాలం మరింత మందికి ఆశ్రయం కల్పించాలని నారాయణ సూచించారు. వినతి పత్రం అందించిన వారిలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరఫున మేనేజర్ కులకర్ణి కొండలరావు, హరిప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలో బీసీ, ఎస్సీ ఎస్టీలను

# అణిచివేత, చులకనగా చూస్తూ కుల దురహంకారం

- తెలుగుదేశంలో తొలి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపు,ప్రాధాన్యం లేదు - దళిత యువకుడిపై కూటమి ప్రభుత్వం జాత్యహంకార ధోరణి
- బీసీ మంత్రులపై జాతి దురహంకారం..పదవుల్లోనూ బీసీలకు అన్యాయం - సామాజిక కార్యక్రమాలకు అన్ని పార్టీల నాయకులు హాజరవ్వటం పరిపాటి
- ఆరు నెలలలో ఈవీఎం ఎమ్మెల్యే ఆదిరెడ్డి దందాల లిస్ట్ లెక్కలేనంత - ఇసుక ర్యాంపుల ద్వారానే రూ 24 లక్షలపైనే ఆదాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** తెలుగుదేశం పార్టీలో కుల దురహంకారం, కూటమి పాలనలో జాత్యాహంకార ధోరణి పెచ్చుమీరిందని వైయస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతిన్యిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అయినా సరే.. టీడీపీలో బీసీ, ఎస్సీ ఎస్టీలను అణిచి వేస్తూ, చులకనగా చూస్తూ కుల దురహంకారం ప్రదర్శిస్తున్నారని ఆయన వాపోయారు. స్థానిక మోరంపూడి రోడ్డులోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం పోలీసు స్టేషన్ లో దళిత యువకుడిని దారుణంగా అవమానించి, అర్థనగ్నంగా లాకప్‌లో కూర్చోబెట్టిన అంశంపై ఇప్పటి వరకు పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తమ కాలనీలో సమస్యపై ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నించడాన్ని తప్పుబట్టిన ప్రభుత్వం, రాజమహేంద్రవరంలో విద్యావంతుడైన ఒక దళిత యువకుడిని దారుణంగా వేధించి, పోలీస్ స్టేషన్ లాకప్‌లో అర్ధనగ్నంగా మహిళా కానిస్టేబుళ్ల ముందు నిలబెట్టారని, దారుణంగా దూషించి చంపేస్తామని కూడా బెదిరించారని, అయినా చర్యలు లేవని భరత్ విమర్శించారు. ఈ ఘటనపై వైయస్సార్‌సీపీ జాతీయ ఎస్సీ కమిషన్‌తో పాటు, జాతీయ మానవ హక్కుల సంఘానికి (ఎన్‌హెచ్ఆర్‌సీ) కూడా ఫిర్యాదు చేయడంతో, వారు స్పందించి ఏపీ డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు పంపారని, అయినా , ప్రభుత్వం మాత్రం స్పందించలేదని ఆయన వాపోయారు. అకారణంగా దళిత యువకుడిని వేధించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కచ్చితంగా జాత్యా హంకారమే అని అయన అన్నారు. ఇక ఏలూరు జిల్లా నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో పార్టీలకతీతంగా వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారని, పైగా అది పూర్తిగా ఒక ప్రైవేటు కార్యక్రమమని, ఆ కార్యక్రమానికి తను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో, మంత్రి పార్థసారథి, గౌతు లచ్చన్న సామాజిక వర్గానికే చెందిన జోగి రమేష్ , టీడీపీకే చెందిన ఎమ్మెల్యే గౌతు లచ్చన్న మనవరాలు గౌతు శిరీష కూడా హాజరయ్యారని భరత్ ప్రస్తావించారు. అయితే కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నేత పాల్గొనడాన్ని టీడీపీ పెద్దలు సహించలేకపోయారని,దీనిపై మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గౌతు శిరీషను తప్పు పడుతూ, వివరణ కోరడమే కాకుండా, వారితో క్షమాపణలు చెప్పించడం ఎంతవరకు న్యాయమని ఆయన నిలదీసారు. పైగా వారిపై పార్టీ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేయించడం దారుణమన్నారు.ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా దీనిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని ఆయన గుర్తుచేసారు. ఇది కచ్చితంగా కుల దురహంకారమేనన్నారు. టీడీపీలో తొలి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపు, ప్రాధాన్యం లేదన్నారు. ప్రైవేటు కార్యక్రమాల్లో పార్టీలక తీతంగా పాల్గొనడం సహజమైనా, దాన్ని టీడీపీ పెద్దలు తప్పు పట్టడం అత్యంత హేయనీయమని భరత్ విమర్శించారు. నిజానికి ఈ విషయంలో వారికో న్యాయం.. పార్టీ నాయకులకో న్యాయం అన్నట్లుగా ఆ పార్టీ పెద్దలు వ్యవహరిస్తున్నారన్నారు. ఎందుకంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కమ్మ గ్లోబల్ సమ్మిట్ లో పార్టీలకు అతీతంగా ఆ సామాజికవర్గానికి చెందిన నాయకులు పాల్గొన్నారని భరత్ గుర్తుచేస్తూ, మరి అప్పుడు దాన్ని చంద్రబాబు, లోకేష్ ఎందుకు తప్పు పట్టలేదు? అని ప్రశించారు. అంతెందుకు మేము అధికారంలో ఉన్నప్పుడు మా పార్టీ ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు, టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్‌నాయుడితో కలిసి తిరిగేవారని, అయినా ఏనాడూ మేం అభ్యంతరం చెప్పడం గానీ, తప్పు పట్టడం గానీ చేయలేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు.

కూటమి పాలనలో బీసీలను అణగదొక్కే విధానం పదవుల పంపకాల్లోనూ కనిపిస్తోందని, రాజమహేంద్రవరంలో సీనియర్ నాయకులు ఎర్రా వేణు, వాసిరెడ్డి రాంబాబుకు ఏపీ స్టేట్ డైరెక్టర్ పోస్టులతో సరిపెట్టి, రాజానగరం మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్‌కి కేబినెట్ హోదా కల్పించారని భరత్ ప్రస్తావించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విచిత్రంగా రాజమహేంద్రవరంలో హోమియో మందుల షాపు, లిక్కర్ షాపు, మెడికల్ షాపు పక్కపక్కనే ఉంటాయని, గుడిపక్కనే వైన్ షాపును కూడా ఇక్కడే చూడొచ్చని ఆయన ఎద్దేవా చేసారు. ఇదేనా ఎన్డీఏ ప్రభుత్వం కాపాడే సనాతన ధర్మం అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో స్లాటర్ హౌస్ లో రోజుకు 200%-%300 ఆవుల్ని అక్రమంగా నరికేస్తుంటే ఆయన ఏం చేస్తున్నట్టు? ఇదే హిందూ ధర్మ పరిరక్షణ?. ఆ శ్లాటర్ హౌస్ నిర్వాహకుడు కూడా మా ఈవీఎం ఎమ్మెల్యే అనుచరుడే అని భరత్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఆరు నెలల్లో నగరంలో ఈవీఎం ఎమ్మెల్యే దందాల లిస్ట్ చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందేన్నారు. కోటి లింగాల ఘాట్ నుంచి 4వ బ్రిడ్జి వరకు 15 ర్యాంపులు పెట్టి రోజుకు 700 నుంచి 800 లారీలతో డ్రెడ్జింగ్ చేసి ఇసుక తవ్వకాలు చేస్తున్నారుని, ఎమ్మెల్యే మామూళ్ల పేరుతో చిన్న లారీకి వెయ్యి, పెద్ద లారీకి రూ. 2 వేలు.. బాట ఛార్జీల పేరుతో చిన్న లారీకి వెయ్యి, పెద్ద లారీకి రూ. 2 వేలు. ఇవి కాకుండా లోడింగ్ ఛార్జీలు, జేసీబీ ఛార్జీలు.. ఇలా అన్ని కలిపి ఒక్కో లారీ మీద ఎమ్మెల్యేకి అందుకుంటున్న మామూళ్లు రూ.8 వేలకు పైనే ఉందని ఆయన లెక్కలతో ఆరోపించారు. కనీసం 600 లారీలు అనుకున్నా.. ఈవీఎం ఎమ్మెల్యే ఆదాయం రోజుకు రూ. 24 లక్షలకు పైమాటేనన్నారు. రూ.10 కోట్ల విలువైన ఇసుక కొండను బుక్కేశాడని, ఇవి చాలవన్నట్టు ఎక్కడికక్కడ పేకాట క్లబ్బులు నడుతూ, రింగ్ మాస్టర్ ఇక్కడ ఎమ్మెల్యే ఉన్నారని భరత్ ఆరోపించారు.బ్లేడ్ బ్యాచ్‌ను వెంటబెట్టుకుని తిరుగుతూ,ఈవీఎం మహత్యంతో ఎమ్మెల్యే అయ్యాడని, దాని పర్యవసానాలు




ఇప్పుడు రాజమండ్రి ప్రజలు అనుభవిస్తున్నారని భరత్ ఘాటు వ్యాఖ్యలు చేసారు. భాస్కర్‌నగర్‌లో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఎన్ని వేల గజాలు కబ్జాలు చేశారో అందరికీ తెలుసు. ఒకటో వార్డులో లాలా చెరువు దగ్గర దొంగ డాక్యుమెంట్లు క్రియేట్ చేసి రూ.12 కోట్ల విలువైన ఆస్తిని స్వాహా చేస్తున్నారని ఆయన ఆరోపించారు.ఇంకా వైన్ షాప్‌ల నుంచి యథేచ్ఛ వసూళ్లు. నగరంలో 28 షాపులుంటే ఒక్కొ షాపు నుంచి రూ. 50 వేలు,10 బార్‌లుంటే ఒక్కో బార్ నుంచి లక్ష వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నెలకు లిక్కర్ ఆదాయం మరో రూ.24 లక్షలకు పైమాటేనన్నారు. ఒకపక్క ఎక్కడికక్కడ దోపిడీ చేస్తూ, ఇవన్నీ చాలవన్నట్టు నా మీద గౌతమి సూపర్ బజార్ కుంభకోణం అంటూ బురద జల్లుతున్నాడని భరత్ విమర్శించారు.

అధికారం వారి చేతుల్లో ఉంది కదా.. దాని వెనుక ఉన్న బాధ్యులమీద, అధికారుల మీద ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని ఆయన ప్రశించారు.250 గజాల స్థలం లీజులో రూ.5 కోట్ల కుంభకోణం ఏముందో ఈవీఎం ఎమ్మెల్యే చెప్పొచ్చు..దీనిపై నేను విచారణకు సిద్ధంగా ఉన్నా.. స్థలాన్ని లీజుకిచ్చిన అధికారిని పిలిపించి విచారణ చేయించ వచ్చు అని ఆయన సవాల్ చేసారు. ఆరోపణలను నిగ్గ తేల్చే దమ్ము లేకుండా బురద జల్లడం మానుకోవాలన్నా రు. ఆదిరెడ్డి కుటుంబం అవినీతి కుటుంబం అని, రాష్ట్రంలో అతి పెద్ద అవినీతిపరుడు ఎవరని విచారణ చేస్తే మా ఈవీఎం ఎమ్మెల్యే శ్రీనివాస్ మొదటిస్థానంలో ఉంటాడని ఆయన ఆరోపించారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకున్న దాతలు




**తాళ్లపూడి, విశ్వంవాయిస్ న్యూస్:** దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో కొవ్వూరు నియోజకవర్గం గజ్జరం గ్రామం లోని అగ్ని ప్రమాద బాధిత కుటుంబమైన వేమూలూరి భాగ్యం కుటుంబానికి దాతల సహాయంతో 7,000 వేల రూపాయల విలువ చేసే స్టాండ్ ఫ్యాన్, రెండు ఫోల్డింగ్ పరుపుతో కూడిన మంచాలు ఇవ్వడం జరిగింది.ఆర్థిక సహాయం అందించిన దాతలు సహాయం అందించారు. సహాయం చేసిన దాతలకు నాగరాజు ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ప్రతినిధులు దేశాభత్తుల రాజేష్,ప్రత్తిపాటి నాగరాజు,అనపర్తి రాజు, తొర్లపాటి రాజీవ్ పాల్గొన్నారు.

### ఐ టి సి (ఐ ఎల్ టి డి)లో పదవి విరమణ సందర్భంగా

# సత్తి సూర్యనారాయణ రెడ్డిచే సతీసమేతంగా ఘన సన్మానం



**అనపర్తి, విశ్వంవాయిస్ న్యూస్:** అనపర్తి మండలం అనపర్తి గ్రామం R.D.S.F.L డ్రైవర్లు సత్తి గంగిరెడ్డి (అనపర్తి), పాదూరి డేవిడ్ రాజు (అనపర్తి), గంగులూరి సుబ్బారావు (గంగులూరి పాకలు), కచ్చా ఏసు (గంగులూరి పాకలు), నందికోళ్ల గంగరాజు (దుప్పలపూడి), మెండె వీరబాబు (లక్ష్మీ నరసాపురం), చుక్కా వెంకటేశులు (కొత్తూరు), బండారు సుబ్బారావు (కాపవరం) ఐ టి సి (ఐ ఎల్ టి డి) అనపర్తి లో పనిచేసి పదవి విరమణ సందర్భంగా ఈరోజున అనపర్తి నియోజకవర్గ మాజీశాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిచే సతీసమేతంగా ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో వారి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగస్తులు తదితర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





### అంబేద్కర్ గురించి

# అమిత్ షా వ్యాఖ్యలు దారుణం

## తక్షణం కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించాలి
## లేకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తాం
## రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు ఉల్లంరవి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పార్లమెంటులో ఎగ తాళి చేస్తూ, అహంకారపూరితంగా మాట్లా డటం దుర్మార్గమైన చర్య గా ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు ఉల్లంరవి పేర్కొన్నారు. అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్,...అని ఎన్నిసార్లు అంటారు.. దానికి బదులుగా ఒక దేవుడిని స్మరించుకుంటే స్వర్గం లభిస్తుందని రాజ్యసభలో మాట్లాడుతూ అమిత్ షా అనడం శోచనీయమని ఆయన తీవ్రంగా ఖండించారు. కోట్లాదిమంది అంబేద్కర్ ని తమ ఆరాధ్య దేవుడిగా భావిస్తారని ఉల్లంరవి పేర్కొంటూ అటువంటి అంబేద్కర్ పేరు ప్రస్తావిస్తుంటే అమిత్ షా తట్టుకోలేక హేళనగా మాట్లాడ్డం దారుణ మన్నారు. ఎందుకింత అహంకారమని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి అవమానకర వ్యాఖ్యలు పార్లమెంట్ సాక్షిగా చేసినందుకు వెంటనే కేంద్ర మంత్రి పదవి నుంచి ఆయన్ని తప్పించాలని ఆయన డిమాండ్ చేసారు.లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

# ఉచిత ఇసుక అని చెప్పి ఈ చార్జీలేంటి..?

- 229రూపాయలకే ఇసుక అందించాలి అని చంద్రబాబు మాటలకు తూట్లు
- ఉన్నత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి
- బిజెపి ఓబిసి మోర్చా ప్రెసిడెంట్ రొంగలి గోపి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఇసుక దోపిడీ అరికట్టి, ఉచితంగా ఇసుక అందిస్తామని అధికారంలోకి వచ్చి, ఉచిత ఇసుక విధానం ప్రవేశపెడితే ఏజన్సీల పేరిట యథేచ్ఛగా వసూళ్లు చేయడం దారుణమని బిజెపి ఓబిసి మోర్చా ప్రెసిడెంట్ రొంగలి గోపి పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 229రూపాయలకే ఇసుక అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో నిర్ణయించి, ఆదేశాలు ఇచ్చారని అయితే అందుకు భిన్నంగా ర్యాంపుల్లో వసూలు చేస్తున్నారని వాపోయారు. అన్ని చార్జీలు కల్పి 230రూపాయలు నిర్ణయిస్తే, మధ్యలో ఏజన్సీలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. సొసైటీలకు అనుమతులు ఇవ్వడం సాధారణంగా జరిగే విషయమని, అసలు ఏజన్సీలు ఎక్కడ నుంచి వచ్చాయని రొంగలి గోపి పేర్కొన్నారు. ఏజన్సీలకు ఇసుకకు సంబంధం ఏమిటన్నారు. ఉదాహరణకు గాయిత్రి ర్యాంపులో కొన్ని సొసైటీలకు అనుమతి ఇచ్చారని అయితే దానికి మూడు రెట్లు సొసైటీలు పనిచేస్తున్నాయని అయన అన్నారు. సొసైటీల పేరుతొ అనుమతి లేని వ్యక్తులు వచ్చి బాటలు వేసుకోవడం వింతగా ఉందన్నారు. ఇష్టం వచ్చినట్లు బాట ల పరిధి పెంచుకుంటూ పోవడం వలన గట్టు, పరివాహక ప్రాంతం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.

ఈ విషయాలను అధికారులకు విన్నవించి, చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. తమ ఎంపీ పురందేశ్వరి దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని, ప్రభుత్వ పెద్దలకు కూడా ఈ విషయాలు తెలియజేస్తామని రొంగలి గోపి చెప్పారు.

# వినియోగదారుల చట్టంతో రక్షణ

## - నేటి నుంచి వినియోగదారుల వారోత్సవాలు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఈ రోజు స్థానిక జాంపేట లోగల రైతు బజార్ మరియు ఎస్సీ బాలికల వసతి గృహంలో వినియోగదారుల హక్కుల పై అవగాహన సదస్సులను కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యం లో నిర్వహించారు.ఈ కార్యక్రమాని కి డిసిపిసి సభ్యులు సుంకర వీరశేఖర్, గొట్టిముక్కల అనంతరావు హాజయ్యారు. మొదటిగా రైతు బజార్లో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏదైనా సమస్య ఉంటే 1915 కు ఫోన్ చేసి లేదా కన్స్యూమర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసపోకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. తూనికలు కొలతలలో ఎలాంటి తేడాలు ఉన్నట్లు అనిపిస్తే ఎస్టేట్ అధికారి వద్ద ఉన్న ధర్మ కాటాలో సరిచూసుకోవాలన్నారు. అనంతరం ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ తెలివితేటల తో,ధైర్యంతో మోసాలను అరికట్టాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో విద్యార్థినులు, వసతి గృహ వార్డెన్ ప్రభావతి, రైతు బజార్ సిబ్బంది, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.




## కరోనా కంటే 7 రెట్లు ఎక్కువ ప్రాణాంతకమైన అంటువ్యాధి రాబోతోంది..!- డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక!!

**న్యూఢిల్లీ, జనవరి 3, విశాఖటుడే :** 1720లో ప్లేగు, 1817లో కలరా, 1918లో స్పానిష్ ఫ్లూ, 2019లో కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసింది. ప్రపంచంలోని ఏ దేశమూ ఈ మహమ్మారి నుంచి బయట పడలేదు. ఈ ప్రాణాంతక వ్యాధుల బారిన పడి లక్షల కోట్ల మంది ప్రా ణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఇలాంటి ప్రాణాంతక వ్యాధులపై డేంజర్ బెల్స్ ఆగటం లేదు. ఇప్పుడు డబ్ల్యూహెచ్ఓ భవిష్యత్తులో మరో పేరులేని ప్రాణాంతక వ్యాధి ప్రజల్ని వెంటాడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది.ఈ భూమ్మీద ఏదైనా ఒక అంటువ్యాధి వచ్చినప్పుడల్లా అది ప్రపంచవ్యాప్తంగా వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుంది. గత 400 ఏళ్ల చరిత్రను పరిశీలిస్తే ఇదే ఈ విషయం వెల్లడైంది. 1720లో ప్లేగు, 1817లో కలరా, 1918లో స్పానిష్ ఫ్లూ, 2019లో కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసింది. ప్రపంచంలోని ఏ దేశమూ ఈ మహమ్మారి నుంచి బయట పడలేదు. ఈ ప్రాణాంతక వ్యాధుల బారిన పడి లక్షల కోట్ల మంది ప్రాణాలు కోల్పోయారు. స్పానిష్ ఫ్లూని "మదర్ ఆఫ్ ఆల్ ఎపిడెమిక్స్" అని కూడా అంటారు. దీని కారణంగా 5 కోట్లకు పైగా మరణాలు సంభవించాయి.

### నగరపాలక సంస్థ పరిధిలో

# సమగ్ర అభివృద్ధికి డిపిఆర్ సిద్ధం చేయ్యాలి

- వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది
- గాడి తప్పిన ఆర్థిక, పరిపాలన వ్యవస్థను గాడిలోకి తీసుకుని వస్తాం
- ఎడీబి నిధులు, అమృత్ 2.0 నిధుల కేటాయింపు విషయంలో సానుకూలత వ్యక్తం చేశారు
- ఫిబ్రవరి 2025 నాటికి పనులను ప్రారంభించి, రానున్న రెండేళ్ళ లో పూర్తి చేస్తాం
- చెత్త నుంచి సంపద సృష్టి, డంపింగ్ యార్డ్ లేని నగరాల అభివృద్ధి కోసం అడుగులు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆదాయం లేకుండా నగరపాలక సంస్థలు,పురపాలక సంఘాలు స్వీయ ఆర్థిక అభివృద్ధి సాధ్యం కాదన్నది వాస్తవం అని ఆమేరకు వాస్తవికత ను అనుసరించి చర్యలు తీసుకోవాలని ఎవ్వరినీ ఇబ్బందులకు గురి చేయవద్దని రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్ ఎమ్ సి కి చెందిన కార్యాచరణ ప్రణాళిక, 2027 గోదావరీ పుష్కరాలు నేపథ్యంలో రూపొందించిన ముందస్తు ప్రతిపాదనలు పై కలెక్టరు పి. ప్రశాంతి, రుడా ఛైర్మన్, స్థానిక శాసనసభ్యులు, మునిసిపల్ కమిషనర్ లతో సమక్షంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిపాదించిన పనులు, ఇంకా చేపట్టవలసిన పనులు, త్రాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ, పన్నుల వసూళ్ల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. వాటినీ ఆర్థికంగా బలోపేతం చేయడానికి గతంలో పన్నులు వెయ్యని ఆస్తులకు పన్నులు వెయ్యడం, అదనపు నిర్మాణాలు చేపట్టిన వాటికీ పన్నులు విధించడం ద్వారా అన్నారు. గతంలో పన్నులు వెయ్యనవి, పన్నులు వసూలు కానీ వాటిపై దృష్టి పెట్టాలని, గతంలో టిడిపి హయంలో వాటిపై దృష్టి పెట్టడం వల్ల పన్నులు పెంచడం జరగలేదని మంత్రి పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు ఆదాయం సమకూర్చే వాటిపై నివేదిక అంద చెయ్యడం జరిగింది. మునిసిపల్ కమిషనర్ కేతన గార్గ్ వివరిస్తూ, మునిసిపల్ షాప్స్ లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు కొందరు సబ్ లేజ్ కి ఇవ్వడం జరిగిందని, వాటికీ సంబంధించి ఆక్షన్ వేయనున్నట్లు తెలిపారు. మురుగు డిసిల్టేషన్ పనులు యాంత్రీకరణ, మన్యువల్ గా సమాంతరంగా నిర్వహిస్తూ తెలిపారు. సఫాయి కర్మచారి పథకం కింద వాహనాలు సమకూర్చాలని, అందుకు సంబంధించిన లబ్దిదారులను గుర్తిస్తామన్నారు. అదే సమయంలో రానున్న 2027 గోదావరీ పుష్కరాలు నేపథ్యంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధిలో ప్రతిపాదించిన పనులు పై సమగ్రంగా చర్చించడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అభివృద్ది కోసం సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు ద్వారా గతంలో ప్రతిపాదించిన పనులను ఫిబ్రవరి నెలలో పునర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 70 శాతం ఏడీబి ఋణం, మిగిలిన 30 శాతం ప్రభుత్వ గ్రాంటు విడుదల చెయ్యడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా 70 శాతం నిధుల కేటాయింపు కోసం ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ఏ డీ బి బ్యాంకు ముందుగా నిధుల విడుదల చెయ్యాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రానున్న 18 నెలల్లో ఆయా పనులు పూర్తి చెయ్యడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి కొరకు అమృత్ 2.0 పథకం కింద రూ.8400 కోట్ల కేంద్రం గ్రాంటూ ఉండగా, ఇందులో కేంద్రం 36.70 శాతం గ్రాంటు ఇస్తున్నట్లు, మిగిలిన మొత్తాన్ని స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం, 15 వ ఫైనాన్స్ నిధులను అనుసందానం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారి పనులను చేపట్టడం ద్వారా 80 శాతం పైగా పనులను రానున్న రెండో ఏళ్ళల్లో పూర్తి చేసి, గోదావరీ పుష్కరాలు నాటికి నగరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో ఇష్టానుసారం పన్నులు వెయ్యడం జరిగిందని, నిధులను ఆర్థిక క్రమ శిక్షణ లేకుండా ఖర్చు చేశారన్నారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను, పరిపాలన ను గాడిలోకి తీసుకుని రావడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి 130 లీటర్లు త్రాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆర్థికంగా బలోపేతం చేయడానికి అదనపు పన్నులు వెయ్యడం జరగదని, అసెస్మెంట్ చెయడం, నగరపాలక సంస్థ పరిధిలో రు.79 కోట్ల బకాయిలు వసూళ్ళకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2027 గోదావరీ పుష్కరాలు నేపథ్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారని, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రు.1587.80 కోట్లతో, కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.280.90 కోట్ల తో ప్రతిపాదనలను సిద్ధం చేశారని, ముఖ్యమంత్రి సమక్షంలో చర్చించనున్నట్లు తెలియ చేశారు. మరో 15 రోజుల్లో జిల్లాకి చెందిన అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. 2014లో నిర్వహించిన పుష్కరాల సమయంలో పురపాలక మంత్రిగా ఉండి, 2 వేల కోట్ల రూపాయలతో నాలుగు మాసాల్లో అభివృద్ధి పనులు చేపట్టి, పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు మూడు సంవత్సరాల ముందు నుంచే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు డ్రెయిన్స్, అంతర్గత రహదారులు, త్రాగునీరు, మురుగునీరు, వర్షపు నీరు పారుదల వంటి అంశాలపై స్థానిక ప్రజా ప్రతినిధులు సమక్షంలో సంబంధిత శాఖల వారి సమీక్షించి డిపిఆర్ సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలపై భారం పడకూడదని లక్ష్యంతో 2014-19 మధ్యకాలంలో ఒక్క పైసా కూడా టాక్స్ రూపంలో పెంచలేదన్నారు. పురపాలక సంఘాలకు రు. 1500 కోట్ల రూపాయలు టాక్స్ రూపంలో వస్తుందని, అండర్ అసైన్మెంట్, అసైన్మెంట్ కానివి, వాటర్ టాక్స్ సంబంధిత వసూలు కానీ పన్నులు ప్రజలు, సంస్థలు చెల్లించడం ద్వారా రు. 750 కోట్ల ఆదాయం పెరగటంతో పాటు మొత్తం రు. 2100 కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో రు.79 కోట్ల బకాయిలు వసూలు చెయ్యాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందులో ప్రైవేటుగా 40 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఇప్పటివరకు 9 కోట్లు వసూళ్ళు చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలు వసూలు చేసే క్రమంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు. పురపాలక సంఘాల అభివృద్ధి లక్ష్యంగా పక్కా ప్రణాళికతో వెళుతున్నామని మంత్రి నారాయణ తెలియ చేశారు. చెత్త నుండి సంపద విద్యుత్ ఉత్పాదక దిశగా రాజమ హేంద్రవరం, కాకినాడ మధ్య ఒక ప్రాజెక్ట్ ప్రతిపాదిం చనున్నట్లు తెలిపారు. అదే విధంగా కడప, అనంతపురం మధ్య ఒక్క ప్రాజెక్టును ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామన్నారు. నెల్లూరు.. గూడూరు మధ్య ఏర్పాటు చేసే వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు 15 రోజుల్లో టెండర్లు కూడా పిలుస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే గుంటూరు, మంగళగిరి, విశాఖపట్నం వంటి నగరాల్లో వేస్ట్ ఎనర్జీ ప్రాజెక్టులను సమర్ధవంతంగా అమలు జరుగుతున్నట్లు తెలిపారు. పురపాలక సంఘాల ద్వారా రాష్ట్రంలో ప్రతిరోజు 7 వేల టన్నుల చెత్తను సేకరిస్తున్నా మన్నారు. గత ప్రభుత్వం పురపాలక సంఘాలకు ఇవ్వాల్సిన రు. 3,200 కోట్ల రూపాయల నిధులు ఇవ్వకుండా నిలుపుదల చేయటంతో అవి అభివృద్ధి కుంటు పడిందన్నారు. విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ, రానున్న జూన్, జూలై మాసాల్లో పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే సంబంధిత అధికారులతో పలు సమీక్షలు నిర్వహిం చామన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం అని స్పష్టం చేశారు. అమరావతి లో రు. 45 వేల కోట్ల చేపట్టనున్న ఐదు ఐకానిక్ టవర్స్ నిర్మాణానికి గాను టెండర్ల ప్రక్రియనులో త్వరలో ప్రారంభించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చెయ్యడం జరుగుతుందన్నారు.

జిల్లా కలెక్టర్, ఆర్ఎంసి ప్రత్యేక అధికారి పి ప్రశాంతి గోదావరీ పుష్కరాలు, నగరంలో రహదారుల అభివృద్ధి, మురుగు నీరు, వ్యర్థాల నుంచి ఆదాయ వనరులు అంశాలపై వివరించగా, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన గార్గ్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి పాదించిన పనులను వివరిం చారు. కార్య క్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఆర్ఎంసి ప్రత్యేక అధికారి పి ప్రశాంతి, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజా నగరం శాసనసభ్యులు బత్తుల బల రా మకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ చౌదరి,ఆర్ ఎమ్ సి అధి కారులు, రుడా, ఇతర సమన్వయ అధికారులు పాల్గొన్నారు.

### 25 వ అఖిల భారత పోలీసు లాన్ టెన్నిస్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన

## ఏపీ పోలీస్ అధికారులను అభినందించిన డిజిపి




**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్:** 25 వ అఖిల భారత పోలీసు లాన్ టెన్నిస్ పోటీల యందు ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఏపీ పోలీస్ అధికారులను అభినందించిన డిజిపి శ్రీ ద్వారకా తిరుమల రావు. కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరు నందు సి ఐ ఎస్ ఎఫ్, 25 వ అఖిల భారత పోలీసు లాన్ టెన్నిస్ పోటీలను ఐదు రోజుల పాటు నిర్వహించింది. ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల బృందం పోటీలలో పాల్గొని ఓపెన్ సింగిల్స్, ఓపెన్ డబుల్స్ మరియు వెటరన్ డబుల్స్ విభాగాలలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించిన ఎపి పోలీస్ అధికారుల బృంధాన్ని డిజిపి శ్రీ ద్వారకా తిరుమల రావు అభినందించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మరియు కేంద్ర సాయుధ బలగాలు ఈ పోటీలయందు దేశం నలుమూలల నుండి 24 టీమ్స్ పాల్గొన్నాయి. ఐజి శ్రీ కే.వి.మోహన్ రావు క్రీడలు నేతృత్వం లోని అధికారులతో కూడిన బృందం ఇందులో పాల్గొన్నారు.

### ప్రజల ఆదరాభిమానాలతో

# విశేష రీతిలో సేవలందిస్తామని భరోసా

## - రాజమండ్రిలో ఏలూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఎన్ని పెద్ద బ్యాంకులున్నా బడుగు, బలహీన వర్గాలు, చిరు వ్యాపారులకు అనునిత్యం అండగా ఉంటూ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకునేది కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులేనని ఏలూరు మాజీ ఎమ్మెల్యే, అంబికా సంస్థల అధినేత అంబికా కృష్ణ, ది ఏలూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (టెక్బ్యాంక్ ) చైర్మన్ అంబికా ప్రసాద్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్లో టెక్ యు బ్యాంక్ నూతనంగా ఏర్పాటు చేసిన రాజమహేంద్రవరం బ్రాంచ్ను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి ప్రారంభించారు.ఆయనతో పాటు అంబికా కృష్ణ, బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్, ఆర్యాపురం, ఇన్నీసుపేట, జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల చైర్మన్లు చల్లా శంకర్రావు, కోళ్ల అచ్చుత రామారావు, బొమ్మన జయకుమార్, ఆయా బ్యాంకుల డైరెక్టర్లు, పలువురు నగర ప్రముఖులు పాల్గొని బ్యాంకు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ 110 సంవత్సరాల చరిత్ర కలిగిన బ్యాంక్ దిన దిన ప్రవర్ధమానమై ఏలూరులో రెండు, జంగారెడ్డిగూడెం, పాలకొల్లు, విజయవాడలో బ్రాంచీల ద్వారా విజయపథంలో నడుస్తోందన్నారు.ఇప్పుడు ఇక్కడ ఏర్పాటైన బ్రాంచ్ ద్వారా అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలతో విశేష రీతిలో సేవలందిస్తామని భరోసా ఇచ్చారు. త్వరలో విశాఖపట్నం, అనకాపల్లిలో కూడా బ్రాంచీలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.240 కోట్ల టర్నోవర్తో ఆర్బిఐ నిబంధనల మేరకు ప్రతీ ఏడాది లాభాలు ఆర్జిస్తూ సమర్థవంతమైన పాలకవర్గం నాయకత్వంలో ముందుకు సాగుతోందన్నారు. బ్రాంచ్ సిఇఓ ఎం.అచ్యుతరావు, మేనేజర్ వై.లక్ష్మీ ప్రసన్న, కెకె సంజీవరావు, మంచాల బాబ్జీ, సహకార శాఖ అధికారులు, రొబ్బి విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## అంకితా దేవ్
# ప్రత్యేకమైన అందం

అంకితా దవే తన స్టైల్‌తో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారింది. ఆమె 2020లో తన వెబ్ సిరీస్, జిడ్-హాట్‌షాట్స్ నుండి దృష్టిని ఆకర్షించింది. ఈ సిరీస్ విమర్శకుల నుండి చాలా ప్రశంసలు అందుకుంది. అంకిత చాలా సంవత్సరాలుగా అనేక సినిమాలు మరియు వెబ్ సిరీస్‌లకు పని చేసింది. 2019లో సింగర్‌దాన్, 2021లో మేరే అంగనే మెయిన్, మరియు 2021లో నాగర్‌వధు వంటి ఆమె చెప్పుకోదగ్గ కొన్ని ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. అదనంగా, ఆమె 2022లో తేరీ ఖాతాలో మరియు 2021లో చికెన్ కర్రీ లాలో కనిపించింది. ఇతర ప్రాజెక్ట్‌లలో గాచి, మత్కానీ కే మత్కే, 2 ఉన్నాయి. ఆమె ఖాకీ మరియు చార్మ్‌సుఖ్‌లో కనిపించింది అలాగే. ప్రతి అభినయం ఆమె ప్రతిభను ప్రదర్శించి పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకుంది. ఆమె తన జనాదరణను సోషల్ మీడియాలో, ముఖ్యంగా తన జీవితంలోని సంగ్రహావలోకనాలను పంచుకోవడానికి ఉపయోగిస్తుంది. ఆమె తరచుగా తన శైలి మరియు అందాన్ని చూపించే చిత్రాలను పంచుకుంటుంది. ఇటీవల, ఆమె నల్లటి దుస్తులు ధరించి ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేసింది. దుస్తులు ప్రత్యేకమైన డిజైన్‌లు మరియు రంగులను కలిగి ఉన్నాయి.

సినీ వాయిస్ CINEMA

## కంటెంట్ ఉన్న దర్శకులతో
# వైష్ణవ్ కొత్త ప్రాజెక్టులు



మెగా యువ హీరోలందరూ కూడా వారికంటూ ఒక ప్రత్యేకమైన మార్కెట్ తో ముందుకు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే రీసెంట్‌గా వెండితెరకు పరిచయమైన మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ మాత్రం ఇంకా ఒక స్టాన్డర్డ్ మార్కెట్‌ను క్రియేట్ చేసుకోలేకపోయాడు. మొదటి నుంచి కూడా కాస్త డిఫరెంట్ కంటెంట్ ఉన్న సినిమాలను చేసే ప్రయత్నం అయితే చేస్తున్నాడు. ఒకే ఫార్మాట్లో వెళ్లకుండా కమర్షియల్ కథలను కూడా టచ్ చేస్తూ ఉన్నాడు. చివరిగా వైష్ణవ్ తేజ్ నుంచి ఆదికేశవ అనే సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమా దారుణంగా డిజాస్టర్ అయింది. అతని మొదటి సినిమా ఉప్పెన ఏ స్థాయిలో సక్సెస్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ సినిమాతో ఊహించని విధంగా 100 కోట్ల మార్కెట్ ను టచ్ చేసిన వైష్ణవ్ తేజ్ ఒక రికార్డును అయితే క్రియేట్ చేశాడు. ఇక ఆ తర్వాత అతనికి వెంట వెంటనే వరుసగా మూడు ప్రాజెక్టులలో నటించే అవకాశం లభించింది. ఇక ఆది కేశవ డిసాస్టర్ తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న ఈ యువ హీరో మళ్లీ కొత్త తరహా కథలను సెలెక్ట్ చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# మాస్‌కి మీనింగ్ చెప్పేసిన నయా డైరెక్టర్ !



కోలీవుడ్ సంచలనం అట్లీ గురించి చెప్పాల్సిన పనిలేదు. స్టార్ హీరోలతో అట్లీ సంచలనాలు అన్నీ ఇన్నీ కాదు. అతడు తెరకెక్కించిన సినిమాలన్నీ కమర్షియల్ గా మంచి విజయాలు సాధించినవే. షారుక్ ఖాన్‌తో 'జవాన్' తెరకె క్కించి బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఊచ కోత కోసాడు. అట్లీ ఎలాంటి సినిమాలు చేసినా కమర్షియల్ గా ఉంటాయి. మాస్‌కి బాగా కనెక్ట్ అవుతుంటాయి. ఇది అట్లీకి మాత్రమే చెల్లింది. అదే వేలో ట్రై చేసిన కొంత మంది కోలీవుడ్ మేకర్స్ ఫెయిలైనా అట్లీకి మాత్రం ఇంత వరకూ వైఫల్యం ఎదురు కాలేదు. అలాగని అట్లీ కథల్లో అద్భుతం ఏదైనా ఉంటుందా? అంటే అందుకు అవకాశమే ఉండదు. రోటీన్ కథనే తనదైన మాస్ కోణంలో ఆడియన్స్‌కి ఎక్కించడంలో తానో స్పెషలిస్ట్. న్యూ ఏజ్ డైరెక్టర్లలో అట్లీ ని మాస్ కా బాప్ అనొచ్చు. మరి అట్లీ దృష్టిలో మాస్ కి మీనింగ్ ఏంటో తెలుసా? తొలిసారి మీనింగ్ చెప్పాడు. అదెలాగో అట్లీ మాటల్లోనే.. 'మాస్ అంటే ఏలియన్ కాదు. తల్లి ఫీలింగ్ లాంటింది. అమ్మాయి కోసం ఏడిస్తే మాస్..భావోద్వేగం కోసం కన్నీరొస్తే మాస్.. బేబి కోసం కంట తడి పెడితే మాస్.. అవసరమైన సందర్భంలో కోపగించుకోవడం మాస్.. సరైన కారణం కోసం, సమాజం కోసం నిజంగా నిలబడితే అది మాస్. ఇవి కాకుండా మరో కోణంలో మాస్ అని పిలిస్తే అది మాస్ కాదు. ఈ కోణంలోనే నా సినిమాలుంటాయి. అందుకే బాక్సాఫీస్ వద్ద కోట్ల వసూళ్లను సాధిస్తున్నాయి. ఇదే నా సక్సెస్ తారక మంత్రం ' అని అన్నారు. దానికి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇక అట్లీ ఏడాదిన్నర కాలంగా కాళీగానే ఉంటున్నాడు. 'జవాన్' రిలీజ్ తర్వాత ఇంత వరకూ కొత్త ప్రాజెక్ట్ ప్రకటించ లేదు. ఇకపై తానే సినిమా చేసినా అది పాన్ ఇండియాలో సంచలనం అవ్వాలనే దిశగా అడుగులు వేస్తున్నాడు. అలాంటి స్టోరీలపైనే దృష్టి పెడుతున్నాడు. మరి అట్లీ 6 స్టోరీ అయిందా? లేదా? అన్నది తెలియాలి. అలాగే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో సినిమా చేస్తున్నట్లు కూడా కొంత కాలంగా ప్రచారంలో ఉంది. ఆ వివరాలపై వచ్చే ఏడాది క్లారిటీ వస్తుంది.

క్రీడా వాయిస్

## రోహిత్ రిక్వెస్ట్‌తో
# వెనక్కి తగ్గిన అశ్విన్ !



టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించి షాక్‌కు గురి చేశాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. వర్షం కారణంగా ఈ మ్యాచ్ డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న అశ్విన్.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. అశ్విన్ ఆకస్మిక నిర్ణయంతో అభిమానులు, సహచర ఆటగాళ్లు, మాజీ క్రికెటర్లు షాకయ్యారు. సోషల్ మీడియా వేదికగా అతనికి అభినందనలు తెలుపుతున్నారు. భవిష్యత్తు మరింత బాగుండాలని ఆకాంక్షిస్తున్నారు. వాస్తవానికి అశ్విన్.. పెర్త్ టెస్ట్ విజయానంతరమే రిటైర్మెంట్ ప్రకటించాలనుకున్నాడట. ఈ విషయాన్ని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. 'పెర్త్ టెస్ట్ విజయానంతరమే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించేందుకు సిద్దమయ్యారు. కానీ నేనే పింక్ బాల్ టెస్ట్ ఆడాలని రిక్వెస్ట్ చేశాను. నా అభ్యర్థనతో వెనక్కి తగ్గిన అశ్విన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వాయిదా వేసుకొని ఈ రోజు వెల్లడించాడు. అశ్విన్ నిర్ణయాన్ని మేం గౌరవిస్తున్నాం. అశ్విన్‌కు భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. అతను గొప్ప మ్యాచ్ విన్నర్. అశ్విన్ చాలా సరదాగా ఉండే వ్యక్తి. మేం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అశ్విన్ వైపు చూసేవాళ్లం. అతను మమ్మల్ని గట్టెక్కించేవాడు. అతన్ని మేం ఎంతో మిస్సవుతాం.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. 2010 శ్రీలంక పర్యటనలో హరారే వేదికగా జరిగిన వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అశ్విన్.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌తో చివరి మ్యాచ్ ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి అశ్విన్ 765 వికెట్లు తీసాడు. టెస్ట్‌ల్లో 106 మ్యాచ్‌ల్లో 2.83 ఎకానమీతో 537 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 5 వికెట్ల ఘనతను 37 సార్లు అందుకున్నాడు.

# అప్పుడే రిటైర్మెంట్..అంతలో వివాదం




భారత్ ఆస్ట్రేలియా మధ్య బ్రిస్బేన్‌లో జరిగిన మూడో టెస్టు డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. భారత అభిమానులు హమ్మయ్యా అనుకునే లోపే టీమిండియా క్రికెటర్ స్పిన్ మాంత్రికుడు రవిచంద్రన్ అశ్విన్ తాను అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. దీంతో ఒక్కసారిగా అతని అభిమానులు షాక్‌కు గురయ్యారు. అదే సమయంలో ఎక్స్ (ట్విటర్) వేదికగా ఇండియన్ క్రికెట్‌కు అశ్విన్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు. ఇదే జాబితాలో పలువురు ప్రముఖ క్రికెటర్లు కూడా ఉన్నారు. భారత్ ఆస్ట్రేలియా మధ్య గబ్బా వేదికగా జరిగిన మ్యాచ్ వర్షార్పణం అయినప్పటికీ.. అశ్విన్ రిటైర్‌మెంట్ ఇప్పుడు ప్రధాన చర్చగా నిలిచింది. ఇండియా ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో ఇంకా రెండు టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే అశ్విన్ రిటైర్‌మెంట్ ప్రకటన ఒక్కింత షాక్‌కు గురిచేయడమే కాదు.. ఇది సరైన సమయం కూడా కాదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఏది ఏమైనప్పటికీ తన ప్రకటనతో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు. ఇక రిటైర్మెంట్ సమయంలో అశ్విన్ మాట్లాడుతూ తన సహచరుల గురించి ప్రస్తావించారు. కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు పలువురు టీమిండియా ప్లేయర్ల గురించి మాట్లాడాడు. అయితే టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పేరును ప్రస్తావించకపోవడాన్ని ధోనీ అభిమానులు తప్పుబడుతున్నారు. తన ప్రయాణంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, చటేశ్వర్ పుజారా, అజింక్యా రహానేలు చాలా కీలకంగా వ్యవహరించారని వారికి ధన్యవాదాలు తెలిపాడు అశ్విన్ . తన బౌలింగ్‌లో వీరంతా వికెట్ల వెనకాల ఉండి అద్భుతమైన క్యాచ్‌లు పట్టి తన కెరీర్‌లో సాధించిన వికెట్లలో కీలకంగా వ్యవహరించారన్నాడు. టీమిండియా కోచ్‌లు,భారత్ తరపున ఆడేందుకు అవకాశం ఇచ్చిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. అశ్విన్ టీమిండియాలోకి అరంగేట్రం చేసిన నాటికి కెప్టెన్‌గా ధోనీ ఉన్నాడు. అశ్విన్ ఆస్థాయికి చేరడంలో కచ్చితంగా ధోనీ ఇచ్చిన ప్రోత్సాహం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ధోనీ నాయకత్వంలోనే అశ్విన్ జట్టులో ఉండగా టీమిండియా 2011 వరల్డ్ కప్ గెలిచింది. 2013లో ధోనీ నాయకత్వంలోనే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ భారత్ కైవసం చేసుకుంది. అలాంటి వ్యక్తిని అశ్విన్ ఎలా మరిచాడన్న మాట వినిపిస్తోంది. అయితే ప్రెస్‌మీట్ సందర్భంగా తాను ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేనని అశ్విన్ స్పష్టత ఇచ్చాడు. అందుకే ధోనీ పేరును ప్రస్తావించడం మరిచి ఉంటాడని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే.. అశ్విన్, ధోనీ మంచి స్నేహితులు. వారి మధ్య మంచి సంబంధాలున్నాయి. ఐపీఎల్ 2025లో ఇద్దరూ చెన్నై సూపర్ కింగ్స్‌కు కలిసి ఆడతారు. అయితే అశ్విన్ రిటైర్‌మెంట్ ప్రకటన సందర్భంగా మాట్లాడిన మాటల్లో ధోనీ పేరును ప్రస్తావించకపోవడాన్ని అభిమానులు తీసుకోలేకపోతు న్నారు. అయితే తాను కావాల్సిగా ఆ తప్పు చేయలేదనేది స్పష్టమవుతోంది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ గుడ్‌బై !

టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. వర్షం కారణంగా ఈ మ్యాచ్ డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న అశ్విన్.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. ఈ సమయంలో అశ్విన్ కాస్త భావోద్వేగానికి గురయ్యాడు.'నా గురించి చెప్పుకోవడం నాకు ఇష్టం ఉండదు. అంతర్జాతీయ క్రికెటర్‌గా నాకు ఇదే చివరి రోజు. ఆటగాడిగా నేను ఎన్నో మధుర జ్ఞాపకాలను సృష్టించాను. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సీనియర్ ఆటగాళ్లలో మాదే చివరి గ్రూప్. నేను చాలా మందికి కృతజ్ఞతలు చెప్పాలి. బీసీసీఐతో పాటు నా సహచర ఆటగాళ్లకు, కోచ్‌లకు స్పెషల్ థ్యాంక్స్. భారత అంతర్జాతీయ క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. నేను క్లబ్ క్రికెట్ ఆడుతాను. భారత డ్రెస్సింగ్ రూమ్‌లో నేను చాలా సరదాగా ఉండేవాడిని. భారత్ తరఫున ఆడినందుకు గర్వంగా భావిస్తున్నా. రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయం అనుకుంటున్నా. భారత క్రికెట్‌లో నా భాగస్వామ్యం ఉండటం సంతోషంగా ఉంది. 'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. పెర్త్ టెస్ట్ విజయం తర్వాతే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాలనుకున్నాడని, కానీ తానే పింక్ బాల్ టెస్ట్ ఆడేలా కన్విన్స్ చేసానని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. అశ్విన్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని, తదుపరి రెండు టెస్ట్‌లు అతను ఆడడని వెల్లడించాడు. అశ్విన్ స్వదేశానికి వెళ్లిపోతాడని స్పష్టం చేశాడు.

# గబ్బా టెస్ట్‌లో గట్టెక్కిన టీమిండియా !



ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గమనాన్ని తేల్చే గబ్బా టెస్ట్‌లో టీమిండియా ఓటమి నుంచి గట్టెక్కింది. టెయిలెండర్ల అసాధారణ ప్రదర్శనకు వర్షం తోడవ్వడంతో ఈ మ్యాచ్ ఫలితం లేకుండా ముగిసింది. 275 పరుగుల లక్ష్యంతో భారత్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. వర్షం అంతరాయం కలిగించింది. వర్షం తీవ్రత పెరగడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. దాంతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. అంతకుముందు 252/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఐదో రోజు ఆటను ప్రారంభిం చిన భారత్.. మరో 8 పరుగులను జోడించి 260 పరుగులకు ఆలౌటైంది. ట్రావిస్ హెడ్ బౌలింగ్‌లో ఆకాశ్ దీప్(44 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 31)ఆఖరి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. జస్‌ప్రీత్ బుమ్రా(10 నాటౌట్) అజేయంగా నిలిచాడు. దాంతో ఆసీస్‌కు 185 పరుగుల ఆధిక్యం లభించింది. భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. 89/7 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. జస్‌ప్రీత్ బుమ్రా(3/18), ఆకాశ్ దీప్(2/28), మహమ్మద్ సిరాజ్(2/38) నిప్పులు చెరగడంతో ఆసీస్ 85 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో నాథన్ మెక్‌స్వీనీ(4), ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1), మిచెల్ మార్ష్(2), స్టీవ్ స్మిత్(4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ట్రావిస్ హెడ్(17), అలెక్స్ క్యారీ(19 నాటౌట్), ప్యాట్ కమిన్స్(22)లు డబుల్ డిజిట్ స్కోర్ చేశారు. ఈ మ్యాచ్‌లో ఎలాగైన ఫలితం రాబట్టాలనే ఉద్దేశంతో ఆసీస్.. భారత్ ముందు 275 పరుగుల ఊరించే లక్ష్యాన్ని ఉంచింది. కానీ ఆసీస్ ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగుల భారీ స్కోర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో చెలరేగిన ట్రావిస్ హెడ్(160 బంతుల్లో 18 ఫోర్లతో 152)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. విజయం దిశగా సాగిన ఆ జట్టు ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. దాంతో ఆసీస్‌కు 185 పరుగుల ఆధిక్యం లభించింది. భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. 89/7 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. జస్‌ప్రీత్ బుమ్రా(3/18), ఆకాశ్ దీప్(2/28), మహమ్మద్ సిరాజ్(2/38) నిప్పులు చెరగడంతో ఆసీస్ 85 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by **KHANDAVELLI SUNIL KUMAR,** H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: **KHANDAVELLI SUNIL KUMAR.** RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com